
ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శనివారం 7 డిసెంబరు 2024

● ఇక కృష్ణమ్మ పరుగులు



బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్

ఎన్నాళ్లో వేచిన ఉదయం

● విద్యుత్ వెలుగులు



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్

పారిశ్రామిక విస్తరణతో ఉన్న చెరువులు ఎండిపోతున్న 'దృశ్యం'.. సాగు చేయడానికి పంట నీరు కాదు కదా కనీసం తాగడానికి గుక్కెడు మంచినీళ్లు లభించని 'దైన్యం'.. ఫ్లోరైడ్‌తో రక్షిత మంచినీటి కోసం ఢిల్లీ పాలకులను కలిసి మొరపెట్టుకున్న 'కాలం'.. ఇదంతా 17 ఏళ్ల కిందటి 'గతం'.. అమాత్య పదవి వదులుకున్నందుకు దక్కిన 'ఫలితం'.. రాదనుకున్న ప్రాజెక్టును సాధించిన 'భగీరథ యత్నం'.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 'కలల సాగరం' నేడు జాతికి అంకితం!

దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నాలుగువేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌లో విద్యుదుత్పాదన ప్రక్రియను ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు జెన్‌కో యంత్రాంగం ఏర్పాట్లను పూర్తిచేసింది. వైటీపీఎస్‌లో తొలిదశలో 800 మెగావాట్ల యూనిట్-2 నుంచి శనివారం నుంచి విద్యుదుత్పత్తి ప్రక్రియ మొదలవనుంది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ ఇలాత్రిపాఠి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని జెన్‌కో అధికారులు తెలిపారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు ప్రారంభోత్సవం నేడే

- నాలుగు నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు నీరిచ్చే పథకం
- మంత్రి కోమటిరెడ్డి కలల ప్రాజెక్టు

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో లక్ష ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశ్యంతో చేపట్టిన బ్రాహ్మణవెల్లెంల-ఉదయసముద్రం ఎత్తిపోతల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించనున్నారు. ఫ్లోరోసిస్‌తో బాధపడే తన సొంత గ్రామం, పరిసర ప్రజల ఇక్కట్లు తీర్చేందుకు 2007లో ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏఎమ్మార్పీ ద్వారా బ్రాహ్మణవెల్లెంలకు నీటిని తీసుకువచ్చి ఇక్కడ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి లక్ష ఎకరాలకు నీరివ్వాలని పథకానికి రూపకల్పన చేశారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఒప్పించి ఈ పథకానికి రూ.699కోట్లు మంజూరు చేయించారు. 2007లో సీఎం వైఎస్ఆర్ ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. 2009లో పనులు ప్రారంభించగా, 2013 వరకు పనులు వేగంగా సాగినా పథకం పూర్తి కాలేదు. అనంతరం గత పదేళ్లలో ఈ పథకం ముందుకు సాగలేదు. గత ఎన్నికలకు ముందు పంపుహౌస్, లిఫ్టుల పనులు పూర్తిచేసి ట్రయల్ రన్ నిర్వహించినా, రిజర్వాయర్, కాల్వల పనులు అలాగే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ పథకానికి రూ.100కోట్ల నిధులు కేటాయించడంతోపాటు, పెండింగ్ పనులపై దృష్టిపెట్టింది. తాజాగా రిజర్వాయర్‌ని నీటితో నింపారు. కాల్వల నిర్మాణాలకు భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. శనివారం ఈరిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయించడంతో పాటు, పైలాన్‌ను సీఎం ఆవిష్కరించనున్నారు. మరో ఆరునెలల్లో కాల్వల నిర్మాణం పూర్తిచేసేందుకుఅవసరమైన రూ.400 కోట్ల నిధులను శనివారం సీఎం మంజూరు చేస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి.

మొదటిదశలో 50 వేల ఎకరాలకు నీరిచ్చేలా పనులు

లక్ష ఎకరాలకు నిర్దేశించిన బ్రాహ్మణవెల్లెంల-ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం కింద మొదటి దశలో 48,972 ఎకరాలకు ఈ ఏడాది నీరిచ్చేందుకు నిర్ణయించారు. నకిరేకల్ నియోజకవర్గంలో 23వేల ఎకరాలు, నల్లగొండ నియోజవర్గంలో 24వేల ఎకరాలు, మునుగోడులో 3వేల ఎకరాలకు తొలివిడతలో సాగునీటిని ఇస్తారు. 18.575కిలోమీటర్ల ఎడమ ప్రధాన కాల్వలో పెండింగ్ పనులకు, దాని పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ-1లో 18కిలో

- మిగతా 7వ పేజీలో...

సీఎం పర్యటన ఇలా...

సీఎం రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రిగా ఏడాది కాలం పూర్తయిన రోజే సీఎం నల్లగొండ పర్యటనకు వస్తుండడంతో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది.

- శనివారం మధ్యాహ్నం 2గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- 2.25గంటలకు నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలకు చేరుకొని ప్రాజెక్టు డెలివరీ చానల్స్‌ను ప్రారంభించి పైలాన్ ఆవిష్కరిస్తారు. అనంతరం గంగమ్మకు పూజలు నిర్వహిస్తారు.
- 2.55గంలకు బయల్దేరి 3.15గంటలకు దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్‌పవర్‌స్టేషన్‌కు చేరుకుంటారు. 800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యూనిట్-2లో విద్యుదుత్పాదన ప్రక్రియను ప్రారంభిస్తారు. అక్కడే 4గంటల వరకు గడుపుతారు.
- 4.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి నల్లగొండ మెడికల్ కళాశాలకు 4.25గంటలకు చేరుకుంటారు. మెడికల్ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు.
- సాయంత్రం 5గంటలకు మెడికల్ కళాశాల సమీపంలో ఎస్ఎల్‌బీసీ వద్ద రాజీవ్ ప్రాంగణంలో నిర్వహించే బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు.
- సాయంత్రం 6గంటలకు సభ ముగిశాక రోడ్డుమార్గాన సీఎం తిరిగి హైదరాబాద్‌కు పయనమవుతారు.

యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులను పూర్తిచేస్తాం

బీ.వెల్లెంల ప్రాజెక్టు ఘనత వెంకట్‌రెడ్డిదే : మంత్రి ఉత్తమ్

ప్రాజెక్టు కోసం కేసీఆర్‌ను బ్రతిమిలాడా : మంత్రి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల కాలంలో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తామని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వచ్చే మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని పూర్తిచేసి గ్రావిటీ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 7న మండలంలోని బీ.వెల్లెంలలో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. తొలుత రిజర్వాయర్‌ను సందర్శించి తర్వాత స్తూపావిష్కరణ జరిగే పైలాన్‌ను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమై బీఆర్ఎస్ పాలనలో నిలిచిపోయిన అన్ని ప్రాజెక్టులను పూర్తిచేస్తామన్నారు. బీ.వెల్లెంల ప్రాజెక్టును కేసీఆర్ రాజకీయ దురుద్దేశంతోనే పూర్తిచేయకుండా నిలిపివేశారని విమర్శించారు. కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం ఇవ్వడంతోనే నియంత పాలన అంతమై ప్రజాపాలన మొదలైందన్నారు. బీ.వెల్లెంల ప్రాజెక్టు ఘనత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిదేనని



బీ.వెల్లెంల ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొన్నం, తదితరులు

అన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, బీ.వెల్లెంల ప్రాజెక్టు కోసం కేసీఆర్ కాళ్లు పట్టుకోవడం మినహా అన్ని రకాలుగా ప్రాధేయపడ్డానన్నారు. ప్రాజెక్టు నా కోసం కాదని, నాకు గ్రామంలో 3 ఎకరాల భూమి మాత్రమే ఉందని, మూసీ మురుగు, ఫ్లోరైడ్ విషపు నీటిని తాగుతున్న జిల్లా ప్రజల కోసమేనని ఆవేదన వ్యక్తం చేస్తు ప్రాజెక్టు పూర్తిచేస్తానని కేసీఆర్ మాట ఇచ్చి మోసం చేశాడన్నారు. ఏదిఏమైనా తమ ప్రభుత్వంలోనే ప్రాజెక్టు ప్రారంభానికి నోచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని అందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ప్రాజెక్టు స్వరూపాన్ని, నీటి పంపింగ్ చేసే విధానాన్ని అధికారులు మ్యాప్‌ల ద్వారా-

- 7వ పేజీలో...

నేటి నుంచే యాదాద్రి వెలుగులు

- పవర్‌ప్లాంట్‌ను ప్రారంభించనున్న సీఎం
- వీర్లపాలెం వద్ద 2015లో ప్రారంభమైన వైటీపీఎస్ నిర్మాణ పనులు
- ప్లాంట్‌లో ఉద్యోగాలివ్వాలని నిర్వాసితుల డిమాండ్

యాదాద్రి పవర్‌ప్లాంటు మొత్తం ఐదు యూనిట్లుగా చేపట్టగా శనివారం యూనిట్-2లో విద్యుదుత్పాదన మొదలుకానుంది. యూనిట్-1 కూడా విద్యుదుత్పాదనకు సిద్ధమైంది. మిగిలిన మూడు యూనిట్లలో కూడా 85శాతం పనులు పూర్తయ్యాయి. వీటితో పాటు కీలకమైన విష్ణుపురం-పవర్‌ప్లాంట్ యార్డు వరకు చేపట్టిన 8.800కిలోమీటర్ల రైల్వేలైన్ కూడా పూర్తికాగా, బొగ్గు రవాణాకు దక్షిణమధ్య రైల్వే రెండు వ్యాగన్లు కూడా కేటాయించింది. ఈ ప్లాంటుకు పూర్తిగా సింగరేణి బొగ్గును ఉపయోగించాలని నిర్ణయించారు. మొత్తం 2.20మిలియన్ యూనిట్ల బొగ్గును ఇక్కడ వినియోగించేందుకు సింగరేణి అనుమతించింది. మోటమర్రి-జగ్గయ్యపేట-విష్ణుపురం-పవర్ ప్లాంట్ రైల్వే మార్గంలో బొగ్గు ప్లాంట్‌కు చేరనుంది. ఇప్పటికే ఈ ప్రక్రియ మొదలైంది. మరోవైపున విద్యుదుత్పత్తి జరిగిన వెంటనే విద్యుత్ పంపిణీకి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టవర్ లైన్ నిర్మాణం కూడా పూర్తయింది. ప్లాంట్‌కు అవసరమైన నీటి వినియోగం కోసం కృష్ణాజలాల నుంచి ఏడు టీఎంసీలు కేటాయించారు. కృష్ణానది నుంచి ప్లాంటు వరకు నీటి పైప్‌లైన్ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. పవర్‌ప్లాంట్ వద్ద ఇతర అన్ని పనులు పూర్తిచేయడంతో పాటు, ఉద్యోగులు, అధికారులు, కార్మికుల నివాస నిమిత్తం తుంగపాడుబంధం-కృష్ణానది సంగమం వద్ద ప్రత్యేకంగా కాలనీని భారీ టవర్లతో ఏర్పాటు చేస్తున్నారు. దామరచర్ల నుంచి పవర్‌ప్లాంట్ వరకు, అక్కడి నుంచి తుంగపాడు వాగు పక్కగా నూతనంగా నిర్మించే కాలనీ వరకు ప్రత్యేక రోడ్లను సైతం వేసేందుకు నిధులు మంజూరు చేశారు. ఈ పనులన్నింటినీ వచ్చే ఏడాది కాలంలో పూర్తిచేయాలని నిర్ణయించారు.

2015లో మొదలైన పనులు

దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద 2015, జూలై 8న

- మిగతా 6వ పేజీలో...

పటిష్ఠ భద్రత: ఎస్పీ శరత్ చంద్ర పవార్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేసినట్లు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. శుక్రవారం సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఎం పర్యటన సందర్భంగా ఐజీ, డీఐజీ,ఐదుగురు ఎస్పీలు,10మంది అదనపు ఎస్పీలు, 25 మంది డీఎస్పీలు, 75మంది సీఐలు, 170మంది ఎస్ఐలు, 2,500మందితో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామన్నారు. సభకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

చరిత్రలో నిలిచేలా సభ నిర్వహిస్తాం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటై, సీఎంగా రేవంత్‌రెడ్డి, మంత్రులుగా మేం ప్రమాణస్వీకారం చేసి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా చరిత్రలో నిలిచిపోయేలా నల్లగొండలో శనివారం భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం. గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన నల్లగొండ జిల్లా అభివృద్ధికి ఈ ఏడాది కాలంలో ఎన్నో పనులు చేశాం. ఇంకా కీలకమైన ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, ఇతర అన్ని ప్రాజెక్టుల పనులు వేగంగా నిర్వహిస్తున్నాం. జిల్లాకు ప్రగతి నివేదికను సీఎం తన ప్రసంగంలో చెబుతారు. జిల్లా చరిత్రలో మా ప్రభుత్వం ఆధ్వర్యంలో అద్భుతమైన ప్రగతిని సాధించేలా కార్యాచరణ అమలు చేస్తాం. ఈ పనులను సభలో వివరిస్తాం.



ఆరు గ్యారెంటీలు 66 మోసాలు

- ఇదీ కాంగ్రెస్ పాలన
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



కేతేపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

కేతేపల్లి, నకిరేకల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఆరు గ్యారెంటీలు 66 మోసాలతో సాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం సాయంత్రం కేతేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలో నూతనంగా నిర్మించిన గద్దెపై పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. చందంపల్లి, తాటికల్, నకిరేకల్‌లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి 66 మోసాలతో ప్రజలను వంచిస్తున్నారని అన్నారు. కుంభకోణాలకు ప్రసిద్ధి చెందిన కాంగ్రెస్ మూసీ ప్రక్షాళన పేరుతో మరో కుంభకోణానికి తెరతీసిందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకే గ్రామగామాన పార్టీ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో రాచకొండ గోపి, మండల వెంకన్న, చినేని జానయ్య, ఎ.అనితాగౌడ్, జి.సాయన్న, టి.నర్సింహాచారి, వి.నాగయ్య జి.వేణుగోపాల్‌రెడ్డి, పిట్టల వెంకన్న, యానాల శంకర్‌రెడ్డి, అయితగోని అనిత, గోలి ప్రభాకర్, యానాల శ్రీనివాస్‌రెడ్డి, బొడిగే సైదులు, గుడుగుంట్ల సాయన్న, పాల్గొన్నారు.

మార్కెట్‌కు మోక్షం ఎప్పుడో?

- రూ.3.80 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం
- పూర్తి స్థాయిలో రైతుబజార్ లేక ఇబ్బందులు
- మూడేళ్లయినా పూర్తి కాని వైనం



నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో మార్కెట్లు ఉన్న చోట్ల అపరిశుభ్రంగా ఉండటంతో గత ప్రభుత్వం సమీకృత, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లకు శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రంలోని బీట్ మార్కెట్‌లో రూ.3.80 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి 2021 సంవత్సరం డిసెంబరు 31వ తేదీన అప్పటి పురపాలక ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామరావు శంకుస్థాపన చేశారు. అయితే అప్పటికే మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పెద్ద షెడ్లు ఉండేవి. వాటి స్థానంలోనే సమీకృత నిర్మాణ పనులను పూర్తి చేశారు. కానీ పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదు. సమీకృత మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు కొంత మేర పూర్తి కావడం, ఆ పనులు ప్రారంభించి మూడేళ్లయినా పూర్తి కాకపోవడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జనాభాకు అనుగుణంగా మార్కెట్ల ఏర్పాటు

జనాభాకు అనుగుణంగా అధునాతన పద్ధతులతో కూరగాయల మార్కెట్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించి నిధులను కేటాయించింది. రెండు లక్షల జనాభా ఉంటే ఆ జనాభాకు తగినట్లుగా వివిధ ప్రాంతాల్లో హోల్‌సేల్ రిటైల్ కూరగాయలు, చేపలు, మాంసం, పూలు,ఇతర వస్తువుల విక్రయానికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్, సమీకృత మార్కెట్లను ఏర్పాటు చేయాలని తలపెట్టారు. అయితే నల్లగొండ పట్టణంలో నిర్మించిన సమీకృత మార్కెట్ లక్ష్యం నీరుగారి పోయింది. వ్యాపారులను ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేసి వారికి అనేక సౌకర్యాలు కల్పించాల్సిన ఉన్నా మూడేళ్లయినా ఇప్పటికీ అతీగతి లేని పరిస్థితి నెలకొంది.

నాన్‌వెజ్ మార్కెట్ తొలగింపు

సమీకృత మార్కెట్ ఎదురుగానే రామకోటి స్తూప దేవాలయం ఉంది. ఈ మార్కెట్‌లోని నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. దేవాలయం ఎదురుగా మాంసం విక్రయాలు జరపాలని నిర్ణయించడంపై విమర్శలకు దారితీసింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానికులు, భక్తుల విజ్ఞప్తి మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీకృత మార్కెట్ నుంచి నాన్‌వెజ్ మార్కెట్ తొలగించడమే కాకుండా ప్రకాశంబజార్‌లోని వస్త్రలత బజార్‌లో మాంసం విక్రయాల కోసం మార్కెట్‌లో ప్రత్యేకంగా ప్రారంభించారు.

దీంతో ఆ వివాదం సద్దుమణిగింది. ఇక చేపల విక్రయాలు కూడా దేవరకొండ రోడ్డు, పానగల్, ప్రకాశంబజార్‌లో చేస్తున్నారు. సమీకృత మార్కెట్‌లో నాన్‌వెజ్ మార్కెట్ స్థానంలోనే పూల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని తలపెట్టారు. అయినా ఇప్పటి వరకు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూల దుకాణాలను ఏర్పాటు చేయడానికి ప్రారంభం చేయాల్సి ఉన్నా ఆ వైపుగా అడుగులు వేయడం లేదు. సమీకృత మార్కెట్ ప్రారంభం కాకపోవడంతో చిరు వ్యాపారులు సరైన చోటు లేక రోడ్లపైనే విక్రయాలు చేపడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తయితే వ్యాపారులకు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం

సమీకృత మార్కెట్ ప్రారంభోత్సవంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. మార్కెట్‌లో కొన్ని నిర్మాణాలను మార్పులు,చేర్పులు చేసి వీలైతే వచ్చే నెలలో ప్రారంభించే అవకాశాలు ఉంటాయి. ప్రజలకు అందుబాటులోకి సమీకృత మార్కెట్‌ను తీసురురావాడానికి చర్యలు చేపడుతాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్, నల్లగొండ

మళ్లీ మార్పులు చేర్పులు తప్పవు

నాన్‌వెజ్ మార్కెట్‌కు అనుగుణంగా ఒక షెడ్ మొత్తం నిర్మాణాలు చేపట్టారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ మార్కెట్‌లో మార్పులు చేర్పులు చేయాలని అధికారులు నిర్ణయించారు. నాన్‌వెజ్ మార్కెట్ కోసం ఎత్తయిన దిమ్మెలు ఉండే విధంగా బండలతో నిర్మించారు. నీటి సౌకర్యాల కోసం పైపులైన్లు ఏర్పాటు చేశారు. నాన్‌వెజ్ మార్కెట్‌ను తొలగించినందున ఆ మార్కెట్‌లో పూల మార్కెట్ ఏర్పాటు చేస్తే దానికి అనుగుణంగా మళ్లీ నిర్మాణాలు చేయాల్సి ఉంది. దీనికోసం గతంలో కేటాయించిన నిధులు ఉన్నాయా? ఖర్చు అయ్యాయా? లేదంటే కొత్తగా మళ్లీ నిధులు మంజూరు చేయాలా అనే సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం అధికారులు సమీకృత మార్కెట్‌లో మార్పులు చేర్పులు చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో రైతు బజారులు కూడా సరిగ్గా లేకపోవడం ఉన్న బీట్ మార్కెట్‌లోని రైతుబజారులో అధిక శాతం వ్యాపారులే ఉంటున్నారు. కానీ అందులో విక్రయాలు జరగడం లేదు. వెంటనే సమీకృత మార్కెట్‌ను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

'పామాయిల్'కు ప్రాధాన్యమివ్వండి

● మీ వద్దకు వచ్చే పంట కొనుగోలు.. 3 రోజుల్లో చెల్లింపులు

● మంత్రులు తుమ్మల, ఉత్తమ్, పొన్నం



పేట జిల్లా కోదాడ మండలంలో సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేయాలి

మట్టిమనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు

మిర్యాలగూడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ మరణానంతరం అవయవదానం శరీర అవయవాలను దానం చేసినవారి భౌతికదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని మట్టిమనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు ప్రభుత్వాన్ని కోరారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురై అశోక్‌నగర్‌కు చెందిన ఆర్‌వీ.ప్రసాద్ మరణించడంతో కుటుంబ సభ్యులు ఆయన భౌతికకాయాన్ని విద్యార్థుల అధ్యయనం కోసం నల్లగొండ వైద్యకళాశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ జీవికైనా పుట్టడం, మరణించడం ఒక్కటేనని, జీవనం మాత్రం భిన్నమని అన్నారు. అనేక అనేక ఆచారాలు, సాంప్రదాయలాలు పాటించే సమాజంలో వాటిని కాదని సమాజం కోసం దేహాన్ని వైద్యవిద్యార్థుల కోసం ఇవ్వడమనేది గొప్ప మానవీయమైన విలువ అన్నారు. మిర్యాలగూడలో గతంలో మా నవహక్కుల నేత సుబ్బారావు భార్య సత్యవతి, కుమారుడు శరత్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాసరెడ్డి, రవీందర్‌రెడ్డి కుమారుడు అచ్యుత్, మల్లు స్వరాజ్యం, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి తండ్రి లింగారెడ్డి, చవ్వా రాంరెడ్డి ఇలా ఎందరో తమ శరీరాలను, అవయవాలను, కళ్లను దానం చేశారని అన్నారు.

వారి పరోపకార గుణానికి ప్రజలు, ప్రభుత్వం తగు రీతిలో స్పందించి వారి స్ఫూర్తిని మరికొందరికి అందించేందుకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని అన్నారు. మరణ శరీరాన్ని ఇచ్చిన పేద కుటుంబానికి ప్రభుత్వం పథకమేదైనా వర్తించేలా చూడాలని అన్నారు. ఆయన వెంట ప్రసాద్ భార్య లక్ష్మి, కుమార్తెలు సత్య, రమ్య, జడ్పీ మాజీ చైర్మన్ సీడీ.రవికుమార్, తలకోల శ్రీధర్‌రెడ్డి, బాలకృష్ణ, చెన్నూరు రంగారావు, ఇమ్రాన్ ఉన్నారు.

శ్రీమహాలక్ష్మిగా ఎల్లమ్మ తల్లి

కనగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద ఉన్న శ్రీరేణు కా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు శుక్రవారం శ్రీమహాలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారిని పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించారు. శ్రీలక్ష్మి సహస్రనామాలతో విశేషంగా కుంకుమ పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. చీర సారె ఒడిబియ్యం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



ప్రతి విద్యార్థికీ... ఓ గుర్తింపు

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

ప్రతి ఒక్కరికీ గుర్తింపు కోసం ఆధార్ కార్డు ఉన్నట్లే విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా డిజిటల్ అపార్ పేరిట కార్డులను అందజేస్తోంది. వన్ నేషన్, వన్ స్టూడెంట్ పేరిట కేంద్ర మానవ వనరులు, విద్యాశాఖ మంత్రిత్వ శాఖ దేశంలోని విద్యార్థులందరికీ ఈ కార్డులను అందజేయనుంది. ఒకటవ తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులందరికీ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను యూడైస్‌లో నమోదు చేస్తున్నారు. కానీ మరిన్ని వివరాలతో అపార్ కార్డులను జారీ చేయనున్నారు. ఈ మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విద్యార్థుల వివరాల నమోదు ప్రారంభమైంది. అయితే ఒక్కసారి అపార్ కార్డు, నెంబర్ కేటాయించాక ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో జాగ్రత్తగా విద్యార్థుల వివరాలను పాఠశాలల్లోనే అపార్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. త్వరలోనే కార్డులు విద్యార్థులకు చేరనున్నాయి.



- వన్ నేషన్.. వన్ స్టూడెంట్ పేరిట విద్యార్థులకు అపార్ డిజిటల్ కార్డు
- 13 అంకెలతో కార్డు జారీ
- విద్యార్థుల సమగ్ర వివరాలన్నీ అందులో సంక్షిప్తం

ఆధార్ కార్డు విద్యార్థులకు గుర్తింపు నెంబర్‌గా మాత్రమే ఉండగా, యూ డైస్‌తో వారి చదువు వివరాలు మాత్రమే తెలుసుకునే అవకాశం ఉంది. కానీ అపార్‌తో కేటాయించనున్న 13 అంకెల నెంబరు ఆ విద్యార్థికి జీవితకాలం ఉపయోగకరంగా ఉండనుంది. ఆధార్ నెంబర్ లాగే అపార్ నెంబర్ కూడా జీవితకాలం ఒక్కరికే ఉంటుంది. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు పాఠశాల, కళాశాలల వివరాలు, సాధించిన మార్కులు, గ్రేడ్‌లు, సర్టిఫికెట్లు, క్రీడలు ఇతర రంగాల్లో విద్యార్థి సాధించిన విజయాలు అపార్ కార్డులో డిజిటల్ రూపకంలో సంక్షిప్తం చేయనున్నారు. అపార్ కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ విద్యార్థి సమగ్ర వివరాలు అందుబాటులోకి వస్తాయి. ఇందు కోసం ప్రతి ఏడాది ఆ కార్డును విద్యా సంస్థల్లోనే అప్‌డేట్ చేస్తుంటారు. అర్థాంతరంగా చదువు మానేసినా, ఉన్నత చదువులు పూర్తయిన విద్యార్థులు కూడా ప్రైవేట్‌గా అపార్‌కార్డును పొందవచ్చు. వన్‌టైం రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) మాదిరిగా ఉండే అపార్ కార్డుతో ఉన్నత చదువులు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడం, సర్టిఫికెట్ల పరిశీలన సులవు అవుతుంది. అలాగే అవసరమైన సర్టిఫికెట్లను కూడా అపార్ కార్డు ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అపార్ కార్డు వెంట ఉంటే సర్టిఫికెట్లన్నీ జేబులో ఉన్నట్లే భావించవచ్చని విద్యాశాఖ అధికారులు అంటున్నారు.

నమూనా కార్డు



ఎడిట్ ఆప్షన్ లేదు

ఒకసారి అపార్ కార్డు, నెంబర్ జారీ అయ్యాక ఎడిట్ ఆప్షన్ ఉండదు. దీంతో అపార్ కార్డు కోసం వివరాల నమోదులోనే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు పాఠశాల విద్యార్థులకు ఆధార్‌కార్డు ప్రామాణికం కానుండగా కళాశాల విద్యార్థులకు సర్టిఫికెట్లను కూడా పరిగణలోకి తీసుకోనున్నారు. అలాగే అపార్ యాప్‌లో విద్యార్థుల వివరాల నమోదుకు తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరి. ఈ మేరకు ఇటీవలే నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశాల్లో సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు అపార్ కార్డు ఆవశ్యకతపై తల్లిదండ్రులకు వివరించారు. ఆధార్‌కార్డులో ఉన్న విద్యార్థి, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా తదితర వివరాలే అపార్‌లో వస్తాయి. ఆప్షన్స్ ఆధారంగా తల్లిదండ్రుల సమ్మతితో ఇతర వివరాలను ఉపాధ్యాయులు నమోదు చేస్తున్నారు. దీంతో అపార్ నమోదులో ఉపాధ్యాయులు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది.

పాఠశాలల్లోనే నమోదు

అపార్ వివరాలను పాఠశాలల్లోనే ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో నమోదు చేస్తున్నారు. అయితే ఇంటర్‌నెట్, కంప్యూటర్లు లేని పాఠశాలల్లో అపార్ నమోదు ఇబ్బందిగా మారుతోంది. మరికొన్ని పాఠశాలల్లో అన్నిసౌకర్యాలు ఉన్నప్పటికీ తలెత్తుతున్న సాంకేతిక ఇబ్బందులతో అపార్ నమోదు క్లిష్టంగా మారుతోందని ఉపాధ్యాయులు అంటున్నారు. పాఠశాల, ఇంటర్ విద్యార్థుల అపార్ నమోదును జిల్లా విద్యాశాఖలు పర్యవేక్షిస్తుండగా ఆపై కోర్సుల విద్యార్థు అపార్ నమోదును సంబంధిత యాజమాన్యాలు పర్యవేక్షించనున్నాయి.

అపార్ నమోదును చేపట్టాం

పాఠశాలల్లో అపార్ నమోదును ప్రారంభించాం. తల్లిదండ్రుల సమావేశాల్లో కార్డు ఆవశ్యకతను వివరిస్తూ వారి సమ్మతిని తీసుకున్నాం. పిల్లల అపార్ నమోదు కోసం తల్లిదండ్రులు సంబంధిత పాఠశాలలకు వెళ్లాలి.ఎడిట్ ఆప్షన్ లేనందున వివరాల నమోదు సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలి. త్వరలో కార్డులు జారీ కానున్నాయి.

సత్యనారాయణ, డీఈవో యాదాద్రి భువనగిరి



● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సుమారు 3,215 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 2,11,915 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అలాగే సుమారు 1,200 ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 1,75,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాగా ఇంటర్ ఆ పై స్థాయి కోర్సులు చదువుతున్న విద్యార్థులు సుమారుగా 60వేల మంది వరకు ఉన్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,46,915 మంది విద్యార్థులకు అపార్ కార్డులు జారీ కానున్నాయి.

501మంది వివరాలు నమోదు చేశాం

యాదాద్రి జిల్లాలో ఇప్పటివరకు 501మంది వివరాలను నమోదు చేశాం. అన్ని పాఠశాలల్లో నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. సాంకేతిక సమస్యలతో వివరాల నమోదులో ఆలస్యమవుతోంది. ప్రతి విద్యార్థి అపార్ కార్డును పొందాలి. ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలి. అపార్ ద్వారా ఉన్నత విద్యకు, ఉద్యోగాల దరఖాస్తులకు, పరిశీలన సులువవుతోంది.

తిరుమల శ్రీహరి అయ్యంగార్, ప్లానింగ్ కోఆర్డినేటర్, యాదాద్రి జిల్లా



వ్యక్తి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సూర్యాపేటలీగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చేతబడి నెపంతో ఓ వ్యక్తిని హత్యచేసిన నిందితుడికి జీవితఖైదు విధిస్తూ సూర్యాపేట ప్రిన్సిపల్ డిస్టిక్ జడ్జి ఎస్. గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం తీర్పు వెల్లడించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన రణపంగు దానయ్య వ్యవసాయం చేస్తుంటాడు. చేతబడి చేసి తన తనతండ్రిని చంపాడని నెపంతో 2018 సెప్టెంబరు 8వ తేదీ రాత్రి సుమారు 8గంటల ప్రాంతంలో అదేగ్రామానికి చెందిన రక్తసంబంధికుడైన రణపంగు రామయ్య పశువుల కొట్టం ఉండగా రోకలిబండతో దాడి చేశాడు. అనంతరం తీవ్రగాయాలైన రామయ్య మృతి చెందాడని భావించి వెళ్లిపోయాడు. రామయ్య కోడలు విజయ 108 వాహనంలో సూర్యాపేట ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడు రామయ్య రెండు రోజులు చికిత్స పొందుతూ సెప్టెంబరు 10వ తేదీన మృతి చెందాడు. విజయ ఫిర్యాదు మేరకు అప్పటి ఏఎస్‌ఐ కనకరత్నం కేసు నమోదు చేయగా సీఐలు ప్రవీణ్‌కుమార్, జీ వెంకట్‌రెడ్డి పరిశోధన అధికారులుగా నిందితులపై అభియోగపత్రాలు దాఖలుచేశారు. 16మంది సాక్ష్యులను విచారించిన కోర్టు నిందితుడిపై అభియోగాలు నిర్ధారణ కావడంతో రణపంగు దానయ్యకు జీవితఖైదు విధించడంతో పాటు రూ.500 జరిమానా విధించారు.

మామిడాల ఘటనలో ఐదుగురికి రిమాండ్



తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ సాయి ప్రశాంత్

తిప్పర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వివాహిత హత్యకు కారణమైన భర్త కుటుంబ సభ్యులను నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు రిమాండ్ చేశారు. శుక్రవారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ కొండల్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన కోదాటి శ్రీనుకు మిర్యాలగూడ మండలం బాదలాపురం గ్రామానికి చెందిన వాణితో ఆరేళ్ల కిందట వివాహమైంది. కాగా వీరికి ఇద్దరు కుమారులు. వివాహనంతరం ఒక ఏడాది నుంచి భార్యాభర్తలకు నిత్యం గొడవలు జరుగుతుండేవి. కుటుంబసభ్యులు పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ పెట్టి సర్ది చెప్పేవారు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన అర్ధరాత్రి 2 గంటల సమయంలో శ్రీను తన భార్య వాణితో గొడవపడి, బెల్టుతో ఉరివేసి చంపాడు. ఆ తర్వాత సాధారణ మృతిగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. కుమార్తె మృతిపై అనుమానం వచ్చిన వాణి తల్లి సింగం నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించగా హత్యగా వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం శ్రీనుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను విచారించిన పోలీసులు వాణిని ఇబ్బందులకు గురిచేసిన అత్తామామలు కోదాటి రాములు, కన్నమ్మ, బావ, అక్క కోదాటి నాగరాజు, మౌనికలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ కొండల్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ సాయిప్రశాంత్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ఇద్దరి దుర్మరణం

మఠంపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్ మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట మండలం మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడు గ్రామానికి చెందిన దేశినేని రామారావు(45) రఘునాథపాలెంలో కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మేళ్లచెరువు మండలంలోని నక్కగూడెం నుంచి కిష్టపురం మీదుగా రఘునాథపాలెం వరకు కేబుల్ సర్వీస్‌లైన్ వైరు బిగించడంలో భాగంగా శుక్రవారం వైరును బిగిస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. రామారావును గమనించిన స్థానికులు హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. రామారావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని ఏఎస్‌ఐ బాలగంగిరెడ్డి తెలిపారు.

గరిడేపల్లి మండలంలో రైతు ..

గరిడేపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన సమాచారం వివరాలిలా ఉన్నాయి. గరిడేపల్లి మండలం ఎల్బీనగర్ గ్రామానికి చెందిన కర్నె వీరారెడ్డి45) తన వ్యవసాయ పొలం వద్ద కాల్వ తూములో రాయి అడ్డపడి పొలానికి నీరు రానందున, ఆ రాయిని ఇనుప పైప్ సాయంతో తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలకు ఇనుప పైప్ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలోని రైతులు గమనించి వీరారెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వీరారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి ..

కట్టంగూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆటో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం కలిమెర గ్రామంలో శుక్రవారం జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం కలిమెర గ్రామానికి చెందిన కట్ట మల్లయ్య(65) తన వ్యవసాయ బావి వద్ద పనులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వస్తున్నాడు. మార్గ కట్టంగూరు నుంచి ఈదులూరు వెళ్తున్న ఆటో డ్రైవర్ కేతరాజు యాదయ్య అజాగ్రత్తతో మల్లయ్యను ఢీకొట్టాడు. ప్రమాదంలో మల్లయ్య తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మల్లయ్య కుమారుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బెల్టుషాప్ నిర్వాహకులకు రూ.లక్ష జరిమానా

చౌటుప్పల్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న ఇద్దరికి యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ తహసీల్దార్ హరికృష్ణ రూ.లక్ష చొప్పున జరిమానా విధించినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. పంతంగి గ్రామానికి చెందిన బోయ దానయ్య, కొమ్మగోని సత్తయ్య బెల్టుషాపు నిర్వహిస్తూ ఇటీవల రెండుసార్లు పట్టుబడ్డారు. ఈ మేరకు పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. తహసీల్దార్ ఇద్దరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధించారు. మూడు రోజుల్లో జరిమానా చెల్లించకుంటే ఏడాది జైలుశిక్ష విధిస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎస్ఆర్ఎం విద్యార్థి

కోదాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థి నెల్లూరి చిట్టిభవానీ ఎంపికైనట్లు సూర్యాపేట జిల్లా కోదాడ ఎస్ఆర్ఎం పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో భవానీని అభినందించి, మాట్లాడుతూ ఈ నెల 3న చౌటుప్పల్‌లో నిర్వహించిన అండర్-17 ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళ క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. తమ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చటంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీదేవి

ఆత్మహత్య కేసులో ఆరుగురిపై కేసు నమోదు

భువనగిరి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్యకు కారకులైన ఆరుగురిపై కేసు నమోదైనట్లు యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన సుబ్బూరి మౌనికకు అదే మండలం ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన మల్లెల మహేందర్‌తో ఏడేళ్ల కిందట వివాహమైంది. ఈ దంపతులు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో నివాసముంటున్నారు. వీరికి కుమార్తె అద్య కుమారుడు శెర్విన్ ఉన్నారు. ఈ నెల 4న రాత్రి సమయంలో భర్త మహేందర్ తాగిన మైకంలో మౌనికను కొడుతున్నాడని మహేందర్ అన్న నరేందర్ మౌనిక తండ్రి సుబ్బూరి చంద్రమౌళికి ఫోన్ చేసి చెప్పాడు. అనంతరం అదే రోజు అర్ధరాత్రి మౌనిక, ఇద్దరు పిల్లలను భర్త మహేందర్ సోదరుడు నరేందర్‌లు చందుపట్లలోని ఆమె పుట్టింటిలో విడిచివెళ్లారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మౌనిక ఈ నెల 5న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. తన కుమార్తె ఆత్మహత్యకు వరకట్న వేధింపులు కారణమని భర్త మల్లెల మహేందర్, అత్త పద్మ, మామ మల్లేశ్, బావ నరేందర్, తోటి కోడలు ప్రియాంక, ఆడపడుచు అలివేలుపై తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు చేసినట్లు సంతోష్‌కుమార్ తెలిపారు. ఆ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చిన్నారులకు న్యాయం చేయండి



జగదేవ్‌పూర్-భువనగిరి రహదారిపై రాస్తారోకో చేస్తున్న మౌనిక కుటుంబ సభ్యులు, చిన్నారులు, బంధువులు

తల్లిని కోల్పోయిన కుమార్తె ఆద్య కుమారుడికి శెర్విన్‌లకు న్యాయం చేయాలంటూ భువనగిరి పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం మౌనిక బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. చిన్నారులు కూడా రాస్తారోకోలో పాల్గొన్నారు. చిన్నారుల తండ్రి మహేందర్‌కు ఉన్న ఆస్తిలో చిన్నారులపై రూ.25 లక్షల చొప్పున రూ.50 లక్షలు బ్యాంక్‌లో డిపాజిట్ చేయడంతో పాటు ఆరు ఎకరాల వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు మహేందర్ తండ్రి మల్లేష్ ఒప్పుకోకపోవడంతో సమీపంలోని భువనగిరి-జగదేవ్‌పూర్ రహదారిపై సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో చేశారు. ఈ ఘటన పలువురిని కంటతడి పెట్టించింది. దీంతో ఇరువైపులా రాకపోకలు స్తంభించాయి. న్యాయం జరిగే వరకు రాస్తారోకో విరమింపచేయమని భీష్మించడంతో డీసీపీ రాజేశ్ చంద్ర, ఏసీపీ రవికిరణ్ రెడ్డి, భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్‌లు జోక్యం చేసుకుని ఆందోళనకారులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేయించారు. అనంతరం రాకపోకలను పునరుద్ధరించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి

నిడమనూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు నల్లగొండ జిల్లా నిడమనూరు మండలకేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి వీ శ్రీహరి ఎంపికయ్యారు. గత నెల 7, 8, 9 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని మెరుగైన ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో నిర్వహించే కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. మహారాష్ట్రలో ఈ నెల 9, 10, 11, 12 తేదీల్లో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున శ్రీహరి ఆడనున్నాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తమ పాఠశాల విద్యార్థి శ్రీహరిని ప్రిన్సిపాల్ పాశం వెంకట్‌రెడ్డి, పీఈటీ కోటేష్, అధ్యాపక సిబ్బంది అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు, జిల్లాకు మంచిపేరు తేవాలని ఆకాక్షించారు.



విద్యార్థి శ్రీహరిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి

కబడ్డీ మహిళా జిల్లా జట్టుకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఉన్నత పాఠశాల అధ్యాపక బృందం

ఆలేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి మహిళా కబడ్డీ జట్టుకు యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దాసరి మంజుల, ఫిజికల్ డైరెక్టర్ పూల నాగయ్య తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినులు కటకం భార్గవి, పేరుమళ్ల రేచల్‌లు ఈ నెల 21 పట్టణ ఫ్రెండ్స్‌క్లబ్ ఆవరణలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి జట్టు ఎంపికయ్యారు. ఈ నెల 7వ తేదీ నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

మేళ్లచెర్వు : రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా కబడ్డీ పోటీలకు సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన నాగజ్యోతి ఎంపికయ్యారు. ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే 71వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా కబడ్డీ పోటీల్లో నాగజ్యోతి జిల్లా జట్టు తరుపున పాల్గొననున్నట్లు జైహనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



నాగజ్యోతి

తండ్రి మరణం తట్టుకోలేక తనయుడి ఆత్మహత్య

● ఒకేసారి ఇద్దరి అంత్యక్రియలు



కాటం శ్రీశైలం(ఫైల్), కాటం రాములు (ఫైల్)

సంస్థాన్‌నారాయణపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తండ్రి మరణాన్ని తట్టుకోలేక ఓ తనయుడు తనువు చాలించాడు. ఓ వైపు తండ్రి అంత్యక్రియలకు సిద్ధమవుతుండగా, మరోవైపు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కాటం రాములు(75) అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతిచెందాడు. రాములుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడి వివాహం జరిగింది. చిన్న కుమారుడు శ్రీశైలం(40)కు పెళ్లి కాలేదు. ఇంటి వద్దే ఉంటూ తల్లిదండ్రులను చూసుకుంటూ వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తండ్రి రాములు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. తండ్రి అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం స్వగ్రామంలో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. తండ్రి మరణంతో శ్రీశైలం తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. తల్లి కూడా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడాన్ని తట్టుకోలేకపోయాడు. ఓవైపు తండ్రి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా, ఇంట్లోనుంచి బయటికి వెళ్లిపోయాడు. చివరి క్షణంలో శ్రీశైలం కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులంతా చుట్టుపక్కల వెతికారు. తమ వ్యవసాయ బావి పక్కనే ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రీకుమారులిద్దరి మృతితో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం తండ్రీకుమారుల అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రీ కొడుకుల మరణం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపిక

రాజాపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం దూదివెంకటపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గంజి భానుతేజ, వస్పరి ఉపేందర్ సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 7 8, 9 తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ మధు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు నర్సింహచారి, ఎలేందర్‌రెడ్డి, కనకయ్య, గ్రామస్తులు అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ విజయం సాధించి పాఠశాలకు పేరు తేవాలన్నారు.

సకల హంగులతో మెడికల్ కళాశాల

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నల్లగొండ జిల్లా కేంద్రంలోని గంధంవారిగూడెం వద్ద 42ఎకరాల్లో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కళాశాల సకల హంగులతో సిద్ధమైంది. ఈ కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సాయంత్రం ప్రారంభించనున్నారు. 2022 ఆగస్టులో కళాశాల భవనానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కళాశాల భవన సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మూడు అంతస్తులు, బాలికల వసతి గృహం గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు ఐదంతస్తులు, బాలుర వసతి గృహం గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు ఐదంతస్తులు నిర్మించారు. వీటితో పాటు ప్రిన్సిపాల్ క్వార్టర్స్ గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మూడు అంతస్తుల్లో నిర్మించారు. క్యాంటీన్‌ను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచారు. ప్రహరీ, పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. ప్రాంగణమంతా గ్రీనరి, చెట్లతో కళకళలాడుతోంది.

ఇదే ప్రాంగణంలో నర్సింగ్ కళాశాల నిర్మాణానికి కూడా సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో కొనసాగుతున్న మెడికల్ కళాశాలను త్వరలో ఈ భవన సముదాయంలోకి మార్చనున్నారు.



విద్యుద్దీపాల వెలుగుల్లో మెడికల్ కళాశాల

నేటి నుంచే యాదాద్రి వెలుగులు

(5వ పేజీ తరువాయి)

అప్పటి సీఎం కే.చంద్రశేఖర్‌రావు యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 4,676 ఎకరాల విస్తీర్ణంలో రూ.25,099కోట్ల అంచనావ్యయంతో తొలుత ప్రాజెక్టును చేపట్టగా, కాలక్రమంగా అది రూ.30వేల కోట్లకు చేరింది. ఇక్కడ సేకరించిన భూములతో పాటు వీర్లపాలెం ఆవాసాలైన మోదుగులకుంటతండా, కర్పూరతండాలకు చెందిన 133 గిరిజన కుటుంబాలు నిర్వాసితులయ్యాయి. వీరికి సమీపంలోని శాంతినగర్ శివారులో పునరావాసం కల్పించారు. ఈ గిరిజనులతో పాటు, భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటికొకరికి ఉద్యోగాలిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. భూములు కోల్పోయిన, ఇళ్లు కోల్పోయినవారికి తప్పక ఉద్యోగాలిస్తామని ఇటీవల ప్లాంటు సందర్శన సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించడంతో సుమారు 1,560 మంది నిర్వాసితులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. వీరితో పాటు సమీప తాళ్లవీరప్పగూడెం, నర్సాపురం తదితర ప్రభావిత గ్రామాలకు చెందిన భూములకూ పరిహారమివ్వాలని నిర్వాసితులు ప్రభుత్వానికి విన్నపాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని, ప్రారంభోత్సవ సందర్భంగానైనా తమ గోడు వినాలని బాధితులు కోరుతున్నారు.

లైసెన్స్‌ల రద్దు నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారి లైసెన్స్‌లు రద్దు చేయాలన్న నిర్ణయంపై ప్రజల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. లైసెన్స్‌ల రద్దు విధానాన్ని పునఃసమీక్షించి ప్రత్యామ్నాయ శిక్షలు వేయాలంటున్నారు. అయితే బైక్‌ల త్రిబుల్ రైడింగ్, వేగంగా నడిపినా, ఓవర్ లోడ్‌తో ప్రయాణించే వాహనాలు, డ్రైవర్లపై మాత్రం కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

మద్యం దుకాణాల సంగతేంటి?



మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని పోలీసు శాఖ హెచ్చరిస్తోంది. అయితే మద్యం తాగేందుకు అనువుగా బార్లు, వైన్స్‌కు పర్మిట్‌రూమ్‌లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోతే మద్యం తాగి వాహనాలు నడిపే వారే ఉండరుగా. వాహనదారులపై చర్యలు తీసుకునే సమయంలో బార్లు, వైన్స్‌లపై కూడా చర్యలు తీసుకోవాలి. లైసెన్స్‌ల రద్దు బదులు ఇతర చర్యలు తీసుకుంటే మంచిది. అలాగే దాబాలు, హోటల్స్, బహిరంగ స్థలాల్లో మద్యపాన నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. మద్యం దుకాణాల సమయాన్ని కుదించాలి.

ముచ్చి సంతోష్, భువనగిరి.

లైసెన్స్‌ల రద్దు సరైన నిర్ణయమే



మద్యం తాగి వాహనాలు నడిపే వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని పోలీస్ శాఖ తీసుకున్న నిర్ణయం సరైనదే, వేళాపాళా లేకుండా మద్యం తాగుతూ రహదారులపై ఇష్టానుసారంగా నడుపుతున్న వాహనాలతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. దీంతో వాహన డ్రైవర్ల, బాధితుల కుటుంబాలు నష్టపోతున్నాయి. చట్టాన్ని కఠినంగా అమలుచేయాలి. ఎవరికి ఎలాంటి మినహాయింపులు ఇవ్వొద్దు. ప్రభుత్వాలు కూడా మద్యం విక్రయాలను ఆదాయంగా పరిగణించడం మానుకొని ప్రజారోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి.

పొలపల్లి మైసయ్య, విశ్రాంత రైల్వే ఉద్యోగి, భువనగిరి.

ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి



లైసెన్స్‌ల రద్దు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి. రోడ్డుప్రమాదాలన్నీ మద్యం తాగిన వారితోనే కావడంలేదు. రోడ్డు ప్రమాదాల్లో సాధారణ వ్యక్తులతోనే అధికంగా జరుగుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లోనే మద్యం తాగి ఇతర ప్రాంతాలకు వాహనాలపై వెళ్తుంటారు. అధిక స్పీడ్, బైక్‌లపై త్రిబుల్ రైడింగ్, ఓవర్ లోడ్‌తో వెళ్లే ఆటో తదితర వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటూ వారి లైసెన్స్‌లను రద్దు చేయాలి. మద్యం సేవించి ప్రమాదాలకు కారకులైన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

గుండెబోయిన సురేష్, భువనగిరి.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

(5వ పేజీ తరువాయి)

మీటర్ల కాల్వ పనుల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 12కిలోమీటర్ల కాల్వ తవ్వకానికి, అదేవిధంగా కుడి ప్రధాన కాల్వ 25కిలోమీటర్లలో పెండింగ్ పనులకు అవసరమైన భూసేకరణ చేయనున్నారు. దీని పరిధిలో నిర్మాణంలో ఉన్న డిస్ట్రిబ్యూటరీ-2 కింద 22కిలోమీటర్ల కాల్వ నిమిత్తం అవసరమైన భూసేకరణకు, కాల్వల నిర్మాణ పనులకు మొత్తంగా సుమారు రూ.100 కోట్ల నిధులు కేటాయించారు. అందులో ఇప్పటికే రూ.37కోట్ల నిధులతో భూసేకరణకు అవార్డు ప్రకటించగా, మిగిలిన పనులు కొనసాగుతున్నాయి. మొత్తం 3,838 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇప్పటికే 1,657 ఎకరాల భూమిని సేకరించగా, మిగిలిన భూమి సేకరణకు నోటిఫికేషన్లు ఇచ్చి రైతులతో అంగీకారం కుదిరింది. మొదటిదశలో ఈ ప్రాజెక్టు కింద కుడి ప్రధాన కాల్వ రెండో డిస్ట్రిబ్యూటరీ కింద 18వేల ఎకరాలకు, ఎడమ ప్రధాన కాల్వ డిస్ట్రిబ్యూటరీ-2 కింద 31,390 ఎకరాలకు కలిపి మొత్తం 49వేల పైచిలుకు ఎకరాలకు నీరిచ్చేలా పనులు సాగుతున్నాయి.



సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న ఉదయ సముద్రం పైలాన్



పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి



రిజర్వాయర్ వద్ద హెలీప్యాడ్

నాలుగు నియోజక వర్గాలు 90 గ్రామాలు

ఏఎమ్మార్పీ ప్రాజెక్టులో అంతర్భాగంగా చేపట్టిన ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగునీరందుతుంది. నల్లగొండ సమీపంలోని పానగల్‌లోని ఉదయ సముద్రం రిజర్వాయర్ నుంచి అండర్ టన్నెల్ ద్వారా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల వద్ద నిర్మించే రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. అక్కడి నుంచి కుడి, ఎడమకాల్వల ద్వారా లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేలా పథకాన్ని రూపొందించారు. నార్కట్‌పల్లి, నల్లగొండ, చిట్యాల, మునుగోడు, రామన్నపేట, శాలిగౌరారం, కట్టంగూరు మండలాల్లో ఆయకట్టు ఏర్పడుతుంది. అంతేగాక భూగర్భజలాలు పెంపొందుతాయి.

ప్రాజెక్టు స్వరూపం

నార్కట్‌పల్లి: లక్ష ఎకరాలకు సాగునీరందించేలా రూపొందించిన ఈ ప్రాజెక్టుకు నల్లగొండ ఉదయ సముద్రం రిజర్వాయర్ నుంచి 6.9కి.మీల పొడవులో ఉండే అప్రోచ్ కెనాల్ ద్వారా పిట్టంపల్లి వద్ద ఉన్న సొరంగమార్గం వరకు నీరు చేరుతుంది. అక్కడి నుంచి 4.7 డయా మీటరు వెడల్పుతో 1.0625కి.మీల దూరం వరకు సొరంగమార్గం ద్వారా చౌడంపల్లి వద్ద నిర్మించిన సర్జ్‌పూల్‌కు నీరు చేరుతుంది. అక్కడి నుంచి పంప్‌హౌస్‌లో ఒక్కొక్కటి 16 మెగావాట్ల సామర్థ్యం ఉన్న రెండు మోటార్లతో 95 మీటర్ల ఎత్తులో ఉన్న రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తారు. ఒక్కో మోటారు 450 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేయగలదు. 0.305 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రిజర్వాయర్‌కు నీటిని చేర్చి అక్కడి నుంచి కుడి, ఎడమల కాల్వలకు లక్ష ఎకరాలకు సాగునీటిని డిస్ట్రిబ్యూటరీల ద్వారా అందించనున్నారు.

బీ.వెల్లెంలకు వస్తున్న రెండో సీఎం రేవంత్‌రెడ్డి

బీ.వెల్లెంల గ్రామాన్ని సందర్శిస్తున్న రెండో సీఎంగా రేవంత్‌రెడ్డి నిలవనున్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెండు పర్యాయాలు బీ.వెల్లెంలను సందర్శించారు. ప్రాజెక్టు పనుల శంకుస్థాపనకు ఓ పర్యాయం రాగా, పల్లెబాటలో భాగంగా దళితులకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభించేందుకు మరోసారి, మొత్తంగా రెండు సార్లు రాజశేఖర్‌రెడ్డి ఈ గ్రామాన్ని సందర్శించారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ గ్రామానికి రానున్నారు.

యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులను పూర్తిచేస్తాం

(5వ పేజీ తరువాయి)

వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు ఎస్పీ రాములునాయక్, ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, బత్తుల ఊశయ్య, పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, వడ్డే భూపాల్‌రెడ్డి, సాగర్ల సైదులు, జెరిపోతుల భరత్, ఐతరాజు యాదయ్య, బింగి కొండయ్య, గడ్డం పశుపతి, ఎస్‌కే సమద్, పల్లె నరేందర్‌రెడ్డి, బొడిగె స్వామి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేశ్, డీఈఈ విఠలేశ్వర్, ఆర్ఐ తరుణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే నినాదం

(ఆంధ్రజ్యోతి, దామరచర్ల): అభివృద్ధి, ప్రజా సంక్షేమమే నినాదంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వీర్లపాలెంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమను హెలికాప్టర్‌లో వచ్చి పరిశీలించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ఏడాది పాలన కొనసాగించిందని, మరో నాలుగేళ్ల పాలన సైతం ఇంతే ఉత్సాహంతో ముందుకు దూసుకుపోతుందన్నారు. ఈనెల 7న సీఎం రేవంత్‌రెడ్డి 800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యూనిట్-2ను ప్రారంభించనున్నారని తెలిపారు. జిల్లా చరిత్రలో ఈ సందర్భం నిలిచిపోతుందన్నారు. అనంతరం పరిశ్రమలోని కంట్రోల్‌రూమ్, సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్న పైలాన్‌ను వారు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వారి వెంట ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, తదితరులు ఉన్నారు.

ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రికార్డ్

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ): ధాన్యం ఉత్పత్తిలో దేశ చరిత్రలో తెలంగాణ రికార్డు స్థాయి ఉత్పత్తి సాధించిందని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సాయితేజ రైస్‌మిల్లులో నూతన టెక్నాలజీతో నిర్మించిన సైలోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ, వరుణుడి కరుణతో సమృద్ధిగా వర్షాలు కురిసి వానాకాలంలో దేశంలోనే అత్యధిక ధాన్యం దిగుబడిని సాధించామన్నారు. అందుకు తెలంగాణ 10 ఉమ్మడి జిల్లాల ప్రజలకు ప్రభుత్వం తరపున సెల్యూట్ చేస్తున్నాని అన్నారు. రాష్ట్రంలో 40లక్షల మంది రైతులు 66.7లక్షల ఎకరాల్లో 153లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించారన్నారు. సన్న ధాన్యానికి మద్దతు ధరకు తోడు ప్రభుత్వం క్వింటకు రూ.500 బోనస్ కల్పించడంతో రైతులు సుమారు రూ.35వేల కోట్ల వరకు లబ్ధిపొందారని అన్నారు. యాసంగిలో కూడా బోనస్ ఇస్తామన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనమేరకు తెలంగాణ సోనా, బీపీటీ, హెచ్ఎంటీ లాంటి సన్నరకం ధాన్యాన్ని రైతులు సాగుచేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల పౌరసరఫరాలశాఖ రూ.58వేల కోట్ల అప్పుల్లోకి కూరుకుపోగా, తమ ప్రభుత్వం వచ్చాక రూ.11వేల కోట్లు చెల్లించి అప్పును రూ.47వేల కోట్లకు తగ్గించిందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోట అని, గత ప్రభుత్వాల కాలంలో కార్యకర్తలు దాడులకు వెరవకుండా నిలిచారని కొనియాడారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని ఐదు ఎత్తిపోతల పథకాలను ఏడాదిలోగా పూర్తి చేయిస్తామన్నారు. రానున్న నాలుగేళ్లలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పు చోటుచేసుకుంటుందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం వ్యాపార దృక్పథంతో కాకుండా రైతులకు లబ్ధి చేకూర్చేందుకు సన్నధాన్యానికి రూ.500 బోనస్ కల్పించిందన్నారు. వరి సాగులో నల్లగొండకు కరీంనగర్ జిల్లాల మధ్య పోటీ సాగుతోందని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, మిల్లర్లు ఒకటి రెండు రూపాయలు లాభం చూసుకొని రైతుల ధాన్యానికి సరైన ధర కల్పించాలన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడి రాష్ట్ర గౌరవాన్ని నిలపాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంపా నాగేందర్, ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, సహాయ కార్యదర్శి రేపాల మధుసూదన్, మిర్యాలగూడ అసోసియేషన్ నాయకులు గౌరు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కర్నాటి నారాయణ, చిట్టిపోలు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



ముక్తాపూర్‌లో జ్యోతిరావుబాపూలే, అంబేద్కర్, కొంగరి భాస్కర్ విగ్రహాలను ఆవిష్కరించిన మంద కృష్ణమాదిగ, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాజ్యోతిరావు బాపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణ పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాజ్యోతిరావు పూలే, కొంగరి భాస్కర్ విగ్రహాలను శుక్రవారం ఆవిష్కరించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల, నిమ్నజాతుల అభ్యున్నతికి మహనీయులు కృషి చేశారని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. విగ్రహాల ఆవిష్కరణ కమిటీ చైర్మన్ కొండమడుగు ఎల్లస్వామి, కన్వీనర్ కొండమడుగు రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్లు దారెడ్డి మంజులా వేణుగోపాల్‌రెడ్డి, కొంగరి కృష్ణ, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కనకుంట్ల రేఖ బాబురావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తడక వెంకటేష్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండలా ధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్, అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్, రావిరాల స్వామి, దారెడ్డి మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

'పామాయిల్'కు ప్రాధాన్యమివ్వండి

- రూ.51వేల సబ్సిడీనిస్తాం..
- మంత్రులు తుమ్మల, ఉత్తమ్, పొన్నంలు



కాపుగల్లు నుంచి రెడ్లకుంట వరకు నిర్మించ తలపెట్టిన రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ పంటలకు రైతులు ప్రాధాన్యమివ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామంలో రూ.20కోట్ల అంచనాతో కాపుగల్లు నుంచి రెడకుంట వరకు నిర్మించ తలపెట్టిన రహదారి నిర్మాణ పనులకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులను సుసంపన్నం చెయ్యాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. అందుకు అను గుణంగా రైతులు అవకాశం ఉన్న ప్రతిచోట పామాయిల్ తోటలు వేయాలని సూచించారు. పామాయిల్ పంటల సాగుకు రూ.51వేలు సబ్సిడీ అందించడంతో పాటు పండిన పంటను రైతు దగ్గరకు వచ్చి కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు చేసిన మూడు రోజులకే చెల్లింపులు ఉంటా యన్నారు. వరికి ఏడాదికి రెండుసార్లు కొనుగోళ్లు, చెల్లింపులు ఉంటే పామాయిల్ పంటకు ప్రతి నెల రెండుసార్లు ఉంటుందన్నారు. పామాయిల్ పంట వేసిన రైతులకు అంతర్ పంట వేసుకునే వెసులుబాటు ఉంటుందని, తద్వారా రైతులు రెండు రకాలుగా లబ్ధి పొందవచ్చన్నారు. ప్రభుత్వం రైతుల మేలు కోరుతోందని, రైతుల కోసం క్లిష్ట సమ యంలోనూ రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.7,625కోట్ల రైతు బంధు మొత్తాన్ని రైతుల ఖాతాలో జమ చేశామని, రూ.3000కోట్లు రైతు బీమా కు కేటాయించామన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి నుంచి రైతుభరోసా అందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో సాధించిన పురోగతిని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇది రైతు పక్షపాత ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



కళావేదికను ప్రారంభించిన అనంతరం పూర్వ విద్యార్థులతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో శ్రీ వేమూరి అభిరామేశ్వర్‌రావు ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో 1983-84 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఏవీ రమణారెడ్డి మోమో రియల్ ఆధ్వర్యంలో కళావేదికను నిర్మించారు. వేదికను శుక్రవారం హెచ్ఎం శేషు, మునిసిపల్ వైస్ చైర్మన్ నాగ రాణితో కలిసి ప్రారంభిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్‌కు ప్రజావిజయోత్సవ శోభ



విద్యుద్దీపాలంకరణలో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ మిరుమిట్లు గొలుపుతోంది. ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన కట్టడాలు, నిర్మాణాలను అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఇం దులో భాగంగా నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌ను శుక్రవారం విద్యుద్దీపాలతో అలంకరించారు. మువ్వన్నెల రంగులతో నిండిన విద్యుద్దీపాలను ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లకు అమర్చి వెలిగించారు. దీంతో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ రాత్రివేళ వెలుగులీనుతోంది.

15 రోజులు.. 200 ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

- మిర్యాలగూడ, సాగర్ నియోజకవర్గాల్లో దొంగల హల్‌చల్

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, సాగర్ నియోజకవర్గాల్లో బ్యాటరీ దొంగలు హడలెత్తిస్తున్నారు. పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో నిలిపిఉన్న ట్రాక్టర్ల బ్యాటరీలను చాకచక్యంగా ఎత్తుకెళ్తున్నారు. ప్రధానంగా పంటసాగు సమయంలో దుక్కిమళ్లలో నిలిపిన ట్రాక్టర్లు స్టార్ట్ కాకపోవడంతో పరుపరుగున వెళ్లి కొత్త బ్యాటరీలను కొని తెచ్చుకొని వ్యవసాయ పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతూ తప్పించుక తిరు గు తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ అర్బన్)

రాగితీగ కోసం వ్యవసాయ మోటార్లకు సంబంధించిన కేబుళ్లు కాజేస్తున్నారు. వరుసగా జరు గుతున్న చోరీలతో రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గుర వుతున్నారు. 15 రోజులుగా సాగర్ ఆయకట్టులో యాస ంగి సాగు పనులు ఊపందుకుంటున్నాయి. వరి నాట్లు వేసేందుకు రైతాంగం సమాయత్తమవుతోంది. అందులో భాగంగా బోరుబావులు, సాగర్ ప్రాజెక్టు నీటి లభ్యత ఆధారంగా దుక్కులు చదును చేసుకునేందుకు ట్రాక్ట ర్లను ఉపయోగిస్తున్నారు. రోజంతా దుక్కులు దున్ని సాయంత్రం వేళలో మిగిలిన పని కోసం పొలాల్లోనే ట్రాక్టర్లను నిలిపి ఇంటికి వస్తున్నారు. దీన్ని పసిగట్టి దొంగల ముఠా బ్యాటరీలను కాజేస్తోంది. కొందరు వ్య క్తులు పగటి వేళలో రెక్కీ. పెట్టి రాత్రి వేళలో చోరీలకు పాల్పడుతున్నారు.

దొంగల ముఠా హల్‌చల్

గత నెలలో మిర్యాలగూడ మండలం పచ్చారుగడ్డలో ఓ రైతు తనపొలంలో కొంతభాగం పంటనూర్పిడి చేసి ధాన్యాన్ని ట్రాక్టర్‌లో నింపి అక్కడే నిలిపి ఇంటికిరాగా, ధాన్యాన్ని కాజేశారు. ఇటీవల వేములపల్లి, మిర్యాలగూ డ, మాడ్గులపల్లి మండలాల పరిధిలో కొందరు రైతులు పొలాన్ని దమ్ముచేయించి అక్కడే నిలిపిన ట్రాక్టర్ల బ్యాటరీలను కాజేశారు. త్రిపురారం, నిడమనూరు, పెద్ద వూర మండలాల్లో బ్యాటరీ దొంగల సంచారం మరిం తగా పెరిగింది. పక్షం రోజుల వ్యవధిలో ఈ ప్రాం తాల్లో సుమారు 200 పైచిలుకు ట్రాక్టర్లకు చెందిన బ్యాటరీలు చోరీకి గురికావడం గమనార్హం. సాగుకు సమాయత్తమయ్యే కీలక దశలో బ్యాటరీలు చోరీకి గురవుతున్న నేపథ్యంలో కొత్త బ్యాట రీలను తెచ్చు కునేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. నాణ్యత గల కంపెనీకి చెందిన కొత్తబ్యాటరీ కొనుగోలు చేయాలంటే రూ. 7 వేలవరకు ఖర్చవుతోంది.

కానీ దొం గల ముఠా కాజేసిన బ్యాటరీలను రహస్యంగా డంప్ చేసి రాత్రి వేళలో హైదరాబాద్‌కు తరలించి ఒక్కో బ్యాటరీని రూ. వెయ్యి లెక్కన స్క్రాప్ కింద విక్రయించి తమ జల్సా లు తీర్చుకుంటున్నట్లుగా తెలుస్తోంది. స్థానికంగా పాత ఇనుప దుకాణం నిర్వాహకులతో పరిచయం ఉన్న వ్య క్తులు చోరీ చేసిన సొత్తును చౌకగా విక్రయించి తమ చిల్లర అవసరాలు తీర్చుకుంటున్నట్లుగా పలు వురు బాధితులు వాపోతున్నారు.

పట్టించుకోని పోలీసులు

చోరీ వ్యవహారం చిన్నదే కదా అనే కోణంలో పోలీసులు ఈజీగా తీసుకుంటున్నారు. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ అంతగా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం, మధ్యా హ్నం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీస్ యంత్రాంగం రాత్రి వేళలో కనిపించడం లేదు. దీంతో రాత్రి గస్తీకి స్వస్తి పలుకుతున్నారు. ఇదే అదునుగా దొంగల ముఠా కాజేసిన వస్తువులను దర్జాగా జిల్లా సరిహద్దు దాటించి సొమ్ము చేసుకుంటున్నట్లుగా తెలు స్తోంది. తాజాగా వేములపల్లి పోలీస్ స్టేషన్‌కు వంద అడుగుల దూరంలో ఉన్న గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ఇంజిన్ చోరీకి గురైన తీరును పరిశీలిస్తే పోలీసుల రాత్రి గస్తీ ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతోంది. పోలీస్ యంత్రాంగం నిఘా పెంచితే చోరీ ముఠాగుట్టు రట్టయ్యే అవకాశం లేకపోలేదని ప్రజలు భావిస్తున్నారు.

రాత్రి నిఘా పెంచుతాం



గ్రామీణ ప్రాంతాల్లో కొందరు చిల్లర చోరీలకు పాల్పడుతున్నట్లుగా ఫిర్యాదు వస్తున్నాయి. ప్రధానంగా రైతులకు సంబంధించిన ట్రాక్టర్ల సొత్తు చోరీకి గురవుతున్నట్లుగా ఫిర్యాదు లొస్తున్నాయి. రాత్రి వేళలో పోలీస్ నిఘా పెంచి పెట్రోలింగ్ ముమ్మరం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- రాజశేఖర్‌రాజు (డీఎస్పీ మిర్యాలగూడ)

ఫిర్యాదు చేసినా పట్టింపులేదు



పొలంలో ఉంచిన ట్రాక్టర్ బ్యాట రీ చోరీకి గురైంది. దీనిపై త్రిపురారం పోలీసులకు ఫిర్యాదు చేస్తే అంతగా పట్టించుకోలేదు. రాత్రి వేళలో పోలీసు పెట్రోలింగ్ లేకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారు.మా ఊర్లో ఇప్పటికే 40 ట్రాక్టర్లకు చెందిన బ్యాటరీలు చోరీ అ య్యాయి. బాధిత రైతులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చిన్నదేగా అంటూ ఈజీగా తీసుకుంటున్నారు. ఇలాగే వదిలేస్తే సమస్య పెద్దదిగా మారుతుం ది. రైతులు ఇబ్బందులను గుర్తించి పోలీస్ నిఘా పెంచాలి.

- షేక్ మదార్‌హుస్సేన్, రైతు, త్రిపురారం)

సీఎం పర్యటనకు ముస్తాబు

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన రోజే ముఖ్యమంత్రి నల్లగొండ పర్యటనకు వస్తుండటంతో ఆయన పర్యటనపై ఉత్సుకత నెలకొంది. జిల్లాలోని నార్కట్‌పల్లి, నల్లగొండ, దామరచర్ల మండలాల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో నాయకులు, అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌బీసీలో నిర్వహించే సభా వేదికను సిద్ధం చేశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాయకులు పర్యవేక్షించారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. బాంబ్‌స్క్వాడ్, పోలీస్ జాగిలాలతో విస్తృత తనిఖీలు చేపట్టారు. సీఎం సభను విజయవంతం చేయాలని నాయకులు కోరారు.


నార్కట్‌పల్లి మండలంలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు


సభ వేదికను సిద్ధం చేస్తున్న కూలీలు


నల్లగొండ పట్టణంలోని మెడికల్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సభా స్థలం, ఏర్పాటు చేసిన కుర్చీలు, బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి

'అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి'

మర్రిగూడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేదలైన నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేసి వారికి గృహాలు నిర్మించాలని అన్నారు. ఎన్నికల హామీలను నేరవేర్చాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు రామలింగాచారి, నీలకంఠ, యాదయ్య, నర్సింహ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల దుర్వినియోగం

శాలిగౌరారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో ఆర్టీసీ బస్సులను వాడుకోవడం సరైంది కాదు. ఇప్పటికే ఆర్టీసీ సంస్థ నష్టాల్లో ఉందని, పల్లెల్లో ఆర్టీసీ బస్సులు రాక ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల సౌకర్యార్థం కాకుండా ఈ ఆర్టీసీ బస్సులను పాలన పేరుతో దుర్వినియోగపర్చడం సరైంది కాదని, చిత్తశుద్ధి ఉంటే ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సులు నడపాలని అన్నారు.

'సీఎం పర్యటనను జయప్రదం చేయాలి'

కనగల్, డిసెంబరు 6:(ఆంధ్రజ్యోతి) ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం నల్లగొండలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి కోరారు. శుక్రవారం కనగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా నల్లగొండ పట్టణం ఎస్ఎల్‌బీసీలో నిర్మించిన మెడికల్ కాలేజీని ప్రారంభిస్తారని అదేవిధంగా కనగల్ మండలానికి మంజూరైన జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, హాఫీజుద్దీన్, గోగు యాదయ్య, పందుల రాజు, జానయ్య మండలి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మునుగోడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చీకటిమామిడి గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ ముత్యాలమ్మ దేవత ఆలయ నిర్మాణం కోసం టీపీసీసీ నాయకుడు నారబోయిన రవిముదిరాజ్ తన వంతుగా రూ.20వేలు విరాళం ప్రకటించారు.

ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

● *మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి*

శాలిగౌరారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గురిజాల గ్రామంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఆయన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ఒక సంవత్సర పాలనలో ప్రజలకు చేసింది శూన్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, నల్లగొండ, సూర్యాపేట జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్లు రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, లయన్స్ క్లబ్ పాస్ట్ జిల్లా గవర్నర్ గోలి అమరేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్, నాయకులు కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, జెర్రిపోతుల చంద్రమౌళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజులు ఏపీజీవీబీ సేవలకు అంతరాయం

చండూరురూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ నూతన సంవత్సరం నుంచి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌గా మారుతున్న సందర్భంగా ఈ నెల 28 నుంచి 31 తేదీ వరకు బ్యాంకు సేవలు నిలిపివేస్తున్నట్లు జిల్లా అసిసెంట్ జనరల్ మేనేజర్, రీజనల్ మేనేజర్ బి. విజయ భాస్కర్ గౌడ్ తెలిపారు. మండలపరిధిలోని నెర్మట గ్రామంలో శుక్రవారం ఏపీజీవీబీ చండూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ రాబోయే నూతన సంవత్సరం 1 జనవరి 2025 నుంచి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌గా మారనుందని తెలిపారు. బ్యాంకు సేవల్లో అంతరాయాన్ని గమనించి ఖాతాదారులు తమ లావాదేవీలను వారి అనుగుణంగా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ మేనేజర్ సీహెచ్ వెంకటేశం, చండూరు బ్రాంచ్ మేనేజర్ ఎస్.ప్రభాకర్ ఇతర బ్యాంక్ సిబ్బంది, గ్రామస్థులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్‌రెడ్డి

చిట్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఉదయసముద్రం ప్రాజెక్టుకు సంబంధించిన విషయాలపై అసత్య ప్రచారాలను మానుకోవాలని మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాలలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయసముద్రం ప్రాజెక్టు ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీనేనని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.700 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి బహిరంగ సభకు కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి పోకల దేవదాస్, పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, శేపూరి యాదయ్య, మారగోని ఆంజనేయులు, ఎద్దులపురి కృష్ణ, కోనేటి కృష్ణ, బోడ స్వామి, జిట్ట చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పృథ్వీ

నార్కట్‌పల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ నార్కట్‌పల్లి మండల అధ్యక్షుడిగా మండలంలోని నక్కలపల్లికి చెందిన జిల్ల పృథ్వీ ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ ఓటింగ్ విధానంలో జరిగిన ఎన్నికకు ఆరుగురు పోటీ చేయగా పృథ్వీకి అధిక ఓట్లు రావడంతో మండల అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ ప్రకటించింది. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికై మర్యాదపూర్వకంగా కలిసిన పృథ్వీని ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు.

'హామీలను నెరవేర్చకుండా జిల్లాకు రావద్దు'

మునుగోడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఈ ప్రాంతానికి రావద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి అన్నారు. మునుగోడు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకు మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ఇలానే చేసిందని, ప్రజలను నమ్మించి మోసం చేయటంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ పడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఆయా పార్టీలకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. పెంబళ్ల జానయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాదగోని నరేందర్, పగిళ్ల, బిక్షం, పులకరం సైదులు, యాదయ్య, రమేష్, నర్సింహ, అంతిరెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనను వ్యతిరేకిస్తున్నాం

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను తాము వ్యతిరేకిస్తున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు కొర్వి శంకర్ అన్నారు. నార్కట్‌పల్లి డిపోకు పూర్వవైభవం, నార్కట్‌పల్లి పట్టణ రోడ్డు విస్తరణ పనుల పూర్తి, చెర్వుగట్టు దేవాలయ అభివృద్ధి తదితర అంశాలపై కాంగ్రెస్ నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేరలేదని విమర్శించారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

● *సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్షలు ప్రారంభం*

చిట్యాల, కేతేపల్లి, శాలిగౌరారం, మర్రిగూడ, కనగల్, మునుగోడు, డిసెంబరు 6: సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీసీవో వరలక్ష్మి డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మండల రీసోర్స్ సెంటర్ వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ మేరకు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, లేనిచో పే స్కేల్ ప్రకటించాలని కోరారు. తమ డిమాండ్లను నేరవేర్చకపోతే దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సరిత, ప్రవల్లిక, జయకాంత్, తిరుమలమ్మ, శ్రీలత, యాదమ్మ పాల్గొన్నారు.

● కేతేపల్లిలో సమగ్ర శిక్ష ఉద్యోగులు రెండు రోజుల నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మహేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్నా సమగ్ర శిక్ష ఉద్యోగుల క్రమబద్ధీకరణ హామీ నెరవేర్చలేదని అన్నారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకుంటే ఈ నెల 9 నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులంతా నిరవధిక సమ్మె చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మల మంజులారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి బంటు రవి, సీఆర్పీలు ఎ.మల్లయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పొన్న సైదులు, మెసెంజర్ రాజేందర్, ఉద్యోగులు సుజాత, రేవతి, ఉమాదేవి, జానకి, మరియమ్మ, నాగమణి, మార్తమ్మ పాల్గొన్నారు.


కేతేపల్లిలో మండల వనరుల కేంద్రం ఎదుట నిరసన దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

● శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మొలుగురి కృష్ణ మాట్లాడుతూ తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకుంటే 10వ తేదీన కలెక్టర్ కార్యాలయంను ముట్టడించి నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు.

● మర్రిగూడ ఎంఈవో శ్రీనివాస్‌కు సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె నోటీసు అందజేశారు. జడ్పీ పాఠశాల కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులకు కూడా సమ్మె నోటీస్ అందజేసినట్లు చంద్రయ్య, విమ్య తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు సత్తెమ్మ, రహీం, సైదులు పాల్గొన్నారు.

● కనగల్ మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో ఎంఈవో పద్మకు సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభు త్వం ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కనీస వేతనం, బీమా సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు ముచ్చపోతుల లక్ష్మి, యాద మ్మ, ఉమ, ఐశ్వర్య, సుజాత, రఫీ, కారింగు జానయ్య, బిల్కిస్‌ఉన్నీసా, సంతోషికుమారి, సుజాత పాల్గొన్నారు.

● మునుగోడులోని ఎమ్మార్సీ భవనంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు రిలే దీక్షలు చేపట్టారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గ్యార నర్సింహ, మండల అధ్యక్ష, కార్యదర్శులు రాములు, పెరిక నర్సింహ, ఓగోటి శంకరయ్యకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా ప్రచార కార్యదర్శి చందపాక నాగరాజు, ఉద్యోగులు అయితరాజు రేణుక, సతీష్, నర్సింహ, సైదులు, ఇందిర, శైలజ, ధనలక్ష్మి, స్వాతి, భాగ్యమ్మ, ధనమ్మ, గీత, రాజమ్మ, రమణ, దివ్య, చంద్రమౌళి, వసంత పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పోరాడాలి


నకిరేకల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీరేశం, నాయకులు


శాలిగౌరారంలో పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం శాలిగౌరారం, నకిరేకల్ పట్టణాల్లో అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ అణగారిన వర్గాల కోసం ఎంతో కృషి చేశాడని, ఆయన సేవలు దేశానికి చిరస్మరణీయంగా నిలిచాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో శాలిగౌరారం తహసీల్దార్ పి.యాదగిరి, ఎంఈవో సైదులు, పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు ధనుంజయ్, బోడ సునీల్‌మాదిగ, బట్ట శ్రీనివాస్, జానయ్య, వెంకటయ్య, నర్సింహ, వెంకన్న పాల్గొన్నారు. నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాచర్ల సైదులు మాదిగ, మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, కమిషనర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలోని మర్రిగూడ బైపాస్ రోడ్డు, డీఈవో ఆఫీస్ సర్కిల్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బీర పంజియాదవ్, బొల్ల సుధాకర్, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, దేవేందర్, యాదయ్య, జమాల్‌బాష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలోని డీఈవో కార్యాలయం ఎదుట గల అంబేడ్కర్ విగ్రహానికి కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.రవీందర్, సత్యనారాయణ, సైదులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో అంబేడ్కర్ వర్ధంతిని పలు సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, భరత్, అచ్చాలు, సత్తయ్య, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.

● కట్టంగూరులో నిర్వహించిన కార్యక్రమంలో కత్తుల కాన్షీరాం, దాసరి సంజయ్, మహేష్, వెంకన్న, సైదులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

● చండూరు మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి అన్నెపర్తి యాదగిరి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సోము శంకర్, నాయకులు క్లెం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కేతేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు బొజ్జ చినవెంకులు, మాచర్ల సైదులు, సీహెచ్.లూర్దుమారయ్య, కందుల మోహన్, రోషయ్య, చెట్టుపల్లి కాశీరాం, సైదులు, గోపి, శంకర్ పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చేకూరి గణేష్, ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు.

● మునుగోడులో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ నేత నారబోయిన రవిముదిరాజ్, మాజీ ఎంపీపీ పోలగోని సత్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ బురుకల బిక్షం, జంగిలి నాగరాజు, సైదులు, లింగస్వామి పాల్గొన్నారు.

● మర్రిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు వెంకటంపేట బాలయ్య, మారయ్య, అజీజ్ రెడ్డి, రాములు, కాశీం, ప్రభుదాస్ పాల్గొన్నారు.

● కనగల్‌లో ఎమ్మార్పీ భవనంలో ఎంఈవో పద్మ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు హాఫీజుద్దీన్, ఎర్రోల శ్రీను, దుబ్బ దేవేందర్, సైదులు, కొండల్ పాల్గొన్నారు.

'ఆక్రమణలపై విచారణ చేపట్టాలి'

కట్టంగూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరులో ముత్యాలమ్మ, మారెమ్మ దేవాలయాల కోసం కేటాయించిన భూమిని ఆక్రమించి ప్లాట్లు చేస్తున్నారని, దీనిపై వెంటనే విచారణ చేపట్టాలని పలువురు గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 593లో దేవునిగుడి నిర్మాణం కోసం 8 గుంటల భూమిని 1963-64లో కేటాయించినట్లు రికార్డుల్లో ఉందని పేర్కొన్నారు. వాటిని పట్టించుకోకుండా కట్టంగూరుకు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి ఆ భూమిలో ప్లాట్‌లు చేస్తున్నారని, సర్వే చేసి దేవుళ్లకు సంబధించిన భూమిని దేవాలయ నిర్మాణం కోసం కేటాయించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో గ్రామస్థులు చెవుగోని జనార్ధన్, అంతటి శ్రీను, అంతటి నగేష్, చెవుగోని శంకర్, చెవుగోని కన్నయ్య, రమేష్, యాదయ్య పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

చిట్యాలరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టిమర్తి జెడ్పీహెచ్ఎస్‌కు గ్రామానికి చెందిన డాక్టర్ గోపాల్‌రెడ్డి క్రీడా సామగ్రిని అందజేశారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన హెచ్ఎం యాదయ్యకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఉన్నా సొంత గ్రామానికి సేవలందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాదయ్య, ఆనంద్, నీరజ, చంద్రయ్య, అనీస్ ఫాతీమా, నర్సింహ, పౌర్ణమి, శ్రీజ, ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

బాటను వెడల్పు చేయాలి

చిట్యాలరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలనాథస్వామి దేవాలయం గుట్ట పక్క నుంచి రైతులకు అవసరమైన విధంగా బాటను వెడల్పు చేయించాలని కోరుతూ గ్రామస్థులు, రైతులు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే వీరేశానికి వినతిపత్రం అందజేశారు. రైతులు వ్యవసాయ భూములకు వెళ్లేందుకు అధికారులకు సూచించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఏర్పుల నర్సింహ, కుర్రు సత్తయ్య, ఏర్పుల వెంకన్న, మర్రి సత్తిరెడ్డి, మర్రి నాగిరెడ్డి, మర్రి రాంరెడ్డి, ముత్తయ్య లింగయ్య పాల్గొన్నారు.

రాజేశ్వరికి ఓయూ డాక్టరేట్

నకిరేకల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన పి.రాజేశ్వరికి ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాల సీఎస్సీ విభాగం నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అధ్యాపకురాలు ప్రొఫెసర్ శ్యామల పర్యవేక్షణలో చెస్ట్ సిటీ స్కాన్ మెడికల్ ఇమేజీ సూపర్ రిజాల్యూషన్ అండ్ క్లాసిఫికేషన్ యూసింగ్ డీప్ లర్నింగ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఓయూ డాక్టరేట్ ప్రకటించింది. ఆమెను ప్రొఫెసర్ శ్యామలతో పాటు, కుటుంబసభ్యులు అభినందించారు.

ఎస్ఎల్‌బీసీపై స్పష్టత ఇవ్వాలి

● *బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్*

రామగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తిపై స్పష్టత ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తి చేయకపోతే అదే సొరంగంలో పూడ్చి పెట్టేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ ఏడాది కాలంలో ప్రజలకు ఏమి చేశారని ప్రజాపాలన ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజాపాలన పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన పద్ధతినే నేడు కాంగ్రెస్ పార్టీ కూడా అదే పద్ధతిని అవలంబిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువత అధికంగా ఉన్నందున పరిశ్రమలు ఏ ర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి వెంకట్‌రెడ్డి కోతలకే పరిమితమయ్యారని అన్నారు. జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ రైతుబంధు, రైతు భరోసా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, అయినా కాంగ్రెస్ సంబురాలు నిర్వహించుకోవడం సిగ్గుచేటని అన్నారు. సమావేశంలో నాయకులు పోతేపాక సాంబయ్య, దాయం భూపాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మాదగోని శ్రీనివాస్‌గౌడ్, నాగం వర్షిత్‌రెడ్డి

సీఎం కప్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలి

● *డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి*

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా డీవైఎస్‌వో ఆధ్వర్యంలో ఈ నెల 7, 8, 9వ తేదీల్లో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించాలని డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన చీఫ్ మినిస్టర్ కప్ కో-ఆర్డినేషన్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీల్లో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి కర్తయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విమల, వివిధ క్రీడా సంఘాల కార్యదర్శులు, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	175	198
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 , కనిష్ఠం 21.0

● ఇక కృష్ణమ్మ పరుగులు



బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్

ఎన్నాళ్లో వేచిన ఉదయం

● విద్యుత్ వెలుగులు



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్

పారిశ్రామిక విస్తరణతో ఉన్న చెరువులు ఎండిపోతున్న 'దృశ్యం'.. సాగు చేయడానికి పంట నీరు కాదు కదా కనీసం తాగడానికి గుక్కెడు మంచినీళ్లు లభించని 'దైన్యం'.. ఫ్లోరైడ్‌తో రక్షిత మంచినీటి కోసం ఢిల్లీ పాలకులను కలిసి మొరపెట్టుకున్న 'కాలం'.. ఇదంతా 17 ఏళ్ల కిందటి 'గతం'.. అమాత్య పదవి వదులుకున్నందుకు దక్కిన 'ఫలితం'.. రాదనుకున్న ప్రాజెక్టును సాధించిన 'భగీరథ యత్నం'.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 'కలల సాగరం' నేడు జాతికి అంకితం!

- ▸ బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు ప్రారంభోత్సవం నేడే
- ▸ నాలుగు నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు నీరిచ్చే పథకం
- ▸ మంత్రి కోమటిరెడ్డి కలల ప్రాజెక్టు

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో లక్ష ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశ్యంతో చేపట్టిన బ్రాహ్మణవెల్లెంల-ఉదయసముద్రం ఎత్తిపోతల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించనున్నారు. ఫ్లోరోసిస్‌తో బాధపడే తన సొంత గ్రామం, పరిసర ప్రజల ఇక్కట్లు తీర్చేందుకు 2007లో ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏఎమ్మార్పీ ద్వారా బ్రాహ్మణవెల్లెంలకు నీటిని తీసుకువచ్చి ఇక్కడ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి లక్ష ఎకరాలకు నీరివ్వాలని పథకానికి రూపకల్పన చేశారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఒప్పించి ఈ పథకానికి రూ.699కోట్లు మంజూరు చేయించారు. 2007లో సీఎం వైఎస్ఆర్ ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. 2009లో పనులు ప్రారంభించగా, 2013 వరకు పనులు వేగంగా సాగినా పథకం పూర్తి కాలేదు. అనంతరం గత పదేళ్లలో ఈ పథకం ముందుకు సాగలేదు. గత ఎన్నికలకు ముందు పంపుహౌస్, లిఫ్టుల పనులు పూర్తిచేసి ట్రయల్ రన్ నిర్వహించినా, రిజర్వాయర్, కాల్వల పనులు అలాగే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ పథకానికి రూ.100కోట్ల నిధులు కేటాయించడంతోపాటు, పెండింగ్ పనులపై దృష్టిపెట్టింది. తాజాగా రిజర్వాయర్‌ని నీటితో నింపారు. కాల్వల నిర్మాణాలకు భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. శనివారం ఈరిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయించడంతో పాటు, పైలాన్‌ను సీఎం ఆవిష్కరించనున్నారు. మరో ఆరునెలల్లో కాల్వల నిర్మాణం పూర్తిచేసేందుకుఅవసరమైన రూ.400 కోట్ల నిధులను శనివారం సీఎం మంజూరు చేస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి.

మొదటిదశలో 50 వేల ఎకరాలకు నీరిచ్చేలా పనులు

లక్ష ఎకరాలకు నిర్దేశించిన బ్రాహ్మణవెల్లెంల-ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం కింద మొదటి దశలో 48,972 ఎకరాలకు ఈ ఏడాది నీరిచ్చేందుకు నిర్ణయించారు. నకిరేకల్ నియోజకవర్గంలో 23వేల ఎకరాలు, నల్లగొండ నియోజవర్గంలో 24వేల ఎకరాలు, మునుగోడులో 3వేల ఎకరాలకు తొలివిడతలో సాగునీటిని ఇస్తారు. 18.575కిలోమీటర్ల ఎడమ ప్రధాన కాల్వలో పెండింగ్ పనులకు, దాని పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ-1లో 18కిలో

- మిగతా 7వ పేజీలో...

సీఎం పర్యటన ఇలా...

సీఎం రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రిగా ఏడాది కాలం పూర్తయిన రోజే సీఎం నల్లగొండ పర్యటనకు వస్తుండడంతో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది.

- ▸ శనివారం మధ్యాహ్నం 2గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- ▸ 2.25గంటలకు నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలకు చేరుకొని ప్రాజెక్టు డెలివరీ చానల్స్‌ను ప్రారంభించి పైలాన్ ఆవిష్కరిస్తారు. అనంతరం గంగమ్మకు పూజలు నిర్వహిస్తారు.
- ▸ 2.55గంలకు బయల్దేరి 3.15గంటలకు దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్‌పవర్‌స్టేషన్‌కు చేరుకుంటారు. 800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యూనిట్-2లో విద్యుదుత్పాదన ప్రక్రియను ప్రారంభిస్తారు. అక్కడే 4గంటల వరకు గడుపుతారు.
- ▸ 4.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి నల్లగొండ మెడికల్ కళాశాలకు 4.25గంటలకు చేరుకుంటారు. మెడికల్ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు.
- ▸ సాయంత్రం 5గంటలకు మెడికల్ కళాశాల సమీపంలో ఎస్ఎల్‌బీసీ వద్ద రాజీవ్ ప్రాంగణంలో నిర్వహించే బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు.
- ▸ సాయంత్రం 6గంటలకు సభ ముగిశాక రోడ్డుమార్గాన సీఎం తిరిగి హైదరాబాద్‌కు పయనమవుతారు.

యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులను పూర్తిచేస్తాం

బీ.వెల్లెంల ప్రాజెక్టు ఘనత వెంకట్‌రెడ్డిదే : మంత్రి ఉత్తమ్

ప్రాజెక్టు కోసం కేసీఆర్‌ను బ్రతిమిలాడా : మంత్రి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల కాలంలో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తామని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వచ్చే మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని పూర్తిచేసి గ్రావిటీ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 7న మండలంలోని బీ.వెల్లెంలలో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. తొలుత రిజర్వాయర్‌ను సందర్శించి తర్వాత స్తూపావిష్కరణ జరిగే పైలాన్‌ను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమై బీఆర్ఎస్ పాలనలో నిలిచిపోయిన అన్ని ప్రాజెక్టులను పూర్తిచేస్తామన్నారు. బీ.వెల్లెంల ప్రాజెక్టును కేసీఆర్ రాజకీయ దురుద్దేశంతోనే పూర్తిచేయకుండా నిలిపివేశారని విమర్శించారు. కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం ఇవ్వడంతోనే నియంత పాలన అంతమై ప్రజాపాలన మొదలైందన్నారు. బీ.వెల్లెంల ప్రాజెక్టు ఘనత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిదేనని అన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, బీ.వెల్లెంల ప్రాజెక్టు కోసం కేసీఆర్ కాళ్లు పట్టుకోవడం మినహా అన్ని రకాలుగా ప్రాధేయపడ్డానన్నారు. ప్రాజెక్టు నా కోసం కాదని, నాకు గ్రామంలో 3 ఎకరాల భూమి మాత్రమే ఉందని, మూసీ మురుగు, ఫ్లోరైడ్ విషపు నీటిని తాగుతున్న జిల్లా ప్రజల కోసమేనని ఆవేదన వ్యక్తం చేస్తు ప్రాజెక్టు పూర్తిచేస్తానని కేసీఆర్ మాట ఇచ్చి మోసం చేశాడన్నారు. ఏది ఏమైనా తమ ప్రభుత్వంలోనే ప్రాజెక్టు ప్రారంభానికి నోచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని అందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ప్రాజెక్టు స్వరూపాన్ని, నీటి పంపింగ్ చేసే విధానాన్ని అధికారులు మ్యాప్‌ల ద్వారా-



యాదాద్రి థర్మల్ ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొన్నం, తదితరులు

- 7వ పేజీలో...

దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నాలుగువేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌లో విద్యుదుత్పాదన ప్రక్రియను ముఖ్యమంత్రి అనుమల రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు జెన్‌కో యంత్రాంగం ఏర్పాట్లను పూర్తిచేసింది. వైటీపీఎస్‌లో తొలిదశలో 800 మెగావాట్ల యూనిట్-2 నుంచి శనివారం నుంచి విద్యుదుత్పత్తి ప్రక్రియ మొదలవనుంది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ ఇలాత్రిపాఠి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని జెన్‌కో అధికారులు తెలిపారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- ▸ నేటి నుంచే యాదాద్రి వెలుగులు
- ▸ పవర్‌ప్లాంట్‌ను ప్రారంభించనున్న సీఎం
- ▸ వీర్లపాలెం వద్ద 2015లో ప్రారంభమైన వైటీపీఎస్ నిర్మాణ పనులు
- ▸ ప్లాంట్‌లో ఉద్యోగాలివ్వాలని నిర్వాసితుల డిమాండ్

యాదాద్రి పవర్‌ప్లాంటు మొత్తం ఐదు యూనిట్లుగా చేపట్టగా శనివారం యూనిట్-2లో విద్యుదుత్పాదన మొదలుకానుంది. యూనిట్-1 కూడా విద్యుదుత్పాదనకు సిద్ధమైంది. మిగిలిన మూడు యూనిట్లలో కూడా 85శాతం పనులు పూర్తయ్యాయి. వీటితో పాటు కీలకమైన విష్ణుపురం-పవర్‌ప్లాంట్ యార్డు వరకు చేపట్టిన 8.800కిలోమీటర్ల రైల్వేలైన్ కూడా పూర్తికాగా, బొగ్గు రవాణాకు దక్షిణమధ్య రైల్వే రెండు వ్యాగన్లు కూడా కేటాయించింది. ఈ ప్లాంటుకు పూర్తిగా సింగరేణి బొగ్గును ఉపయోగించాలని నిర్ణయించారు. మొత్తం 2.20మిలియన్ యూనిట్ల బొగ్గును ఇక్కడ వినియోగించేందుకు సింగరేణి అనుమతించింది. మోటమర్రి-జగ్గయ్యపేట-విష్ణుపురం-పవర్ ప్లాంట్ రైల్వే మార్గంలో బొగ్గు ప్లాంట్‌కు చేరనుంది. ఇప్పటికే ఈ ప్రక్రియ మొదలైంది. మరోవైపున విద్యుదుత్పత్తి జరిగిన వెంటనే విద్యుత్ పంపిణీకి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టవర్ లైన్ నిర్మాణం కూడా పూర్తయింది. ప్లాంట్‌కు అవసరమైన నీటి వినియోగం కోసం కృష్ణాజలాల నుంచి ఏడు టీఎంసీలు కేటాయించారు. కృష్ణానది నుంచి ప్లాంటు వరకు నీటి పైప్‌లైన్ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. పవర్‌ప్లాంట్ వద్ద ఇతర అన్ని పనులు పూర్తిచేయడంతో పాటు, ఉద్యోగులు, అధికారులు, కార్మికుల నివాస నిమిత్తం తుంగపాడుబంధం-కృష్ణానది సంగమం వద్ద ప్రత్యేకంగా కాలనీని భారీ టవర్లతో ఏర్పాటు చేస్తున్నారు. దామరచర్ల నుంచి పవర్‌ప్లాంట్ వరకు, అక్కడి నుంచి తుంగపాడు వాగు పక్కగా నూతనంగా నిర్మించే కాలనీ వరకు ప్రత్యేక రోడ్లను సైతం వేసేందుకు నిధులు మంజూరు చేశారు. ఈ పనులన్నింటినీ వచ్చే ఏడాది కాలంలో పూర్తిచేయాలని నిర్ణయించారు.

2015లో మొదలైన పనులు

దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద 2015, జూలై 8న

- మిగతా 6వ పేజీలో...

పటిష్ట భద్రత: ఎస్పీ శరత్ చంద్ర పవార్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. శుక్రవారం సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఎం పర్యటన సందర్భంగా ఐజీ, డీఐజీ,ఐదుగురు ఎస్పీలు,10మంది అదనపు ఎస్పీలు, 25 మంది డీఎస్పీలు, 75మంది సీఐలు, 170మంది ఎస్ఐలు, 2,500మందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. సభకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

చరిత్రలో నిలిచేలా సభ నిర్వహిస్తాం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటై, సీఎంగా రేవంత్‌రెడ్డి, మంత్రులుగా మేం ప్రమాణస్వీకారం చేసి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా చరిత్రలో నిలిచిపోయేలా నల్లగొండలో శనివారం భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం. గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన నల్లగొండ జిల్లా అభివృద్ధికి ఈ ఏడాది కాలంలో ఎన్నో పనులు చేశాం. ఇంకా కీలకమైన ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, ఇతర అన్ని ప్రాజెక్టుల పనులు వేగంగా నిర్వహిస్తున్నాం. జిల్లాకు ప్రగతి నివేదికను సీఎం తన ప్రసంగంలో చెబుతారు. జిల్లా చరిత్రలో మా ప్రభుత్వం ఆధ్వర్యంలో అద్భుతమైన ప్రగతిని సాధించేలా కార్యాచరణ అమలు చేస్తాం. ఈ పనులను సభలో వివరిస్తాం.



ఆరు గ్యారెంటీలు 66 మోసాలు

▸ ఇదీ కాంగ్రెస్ పాలన ▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



కేతేపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

కేతేపల్లి, నకిరేకల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఆరు గ్యారెంటీలు 66 మోసాలతో సాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం సాయంత్రం కేతేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలో నూతనంగా నిర్మించిన గద్దెపై పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. చందంపల్లి, తాటికల్, నకిరేకల్‌లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి 66 మోసాలతో ప్రజలను వంచిస్తున్నారని అన్నారు. కుంభకోణాలకు ప్రసిద్ధి చెందిన కాంగ్రెస్ మూసీ ప్రక్షాళన పేరుతో మరో కుంభకోణానికి తెరతీసిందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకే గ్రామగామాన పార్టీ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో రాచకొండ గోపి, మండల వెంకన్న, చినేని జానయ్య, ఎ.అనితాగౌడ్, జి.సాయన్న, టి.నర్సింహాచారి, వి.నాగయ్య, జి.వేణుగోపాల్‌రెడ్డి, పిట్టల వెంకన్న, యానాల శంకర్‌రెడ్డి, అయితగోని అనిత, గోలి ప్రభాకర్, యానాల శ్రీనివాస్‌రెడ్డి, బొడిగే సైదులు, గుడుగుంట్ల సాయన్న, పాల్గొన్నారు.

మార్కెట్‌కు మోక్షం ఎప్పుడో?

- ▸ రూ.3.80 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం
- ▸ పూర్తి స్థాయిలో రైతుబజార్ లేక ఇబ్బందులు
- ▸ మూడేళ్లయినా పూర్తి కాని వైనం



నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో మార్కెట్లు ఉన్న చోట్ల అపరిశుభ్రంగా ఉండటంతో గత ప్రభుత్వం సమీకృత, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లకు శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రంలోని బీట్ మార్కెట్‌లో రూ.3.80 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి 2021 సంవత్సరం డిసెంబరు 31వ తేదీన అప్పటి పురపాలక ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు శంకుస్థాపన చేశారు. అయితే అప్పటికే మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పెద్ద షెడ్లు ఉండేవి. వాటి స్థానంలోనే సమీకృత నిర్మాణ పనులను పూర్తి చేశారు. కానీ పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదు. సమీకృత మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు కొంత మేర పూర్తి కావడం, ఆ పనులు ప్రారంభించి మూడేళ్లయినా పూర్తి కాకపోవడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జనాభాకు అనుగుణంగా మార్కెట్ల ఏర్పాటు

జనాభాకు అనుగుణంగా అధునాతన పద్ధతులతో కూరగాయల మార్కెట్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించి నిధులను కేటాయించింది. రెండు లక్షల జనాభా ఉంటే ఆ జనాభాకు తగినట్లుగా వివిధ ప్రాంతాల్లో హోల్‌సేల్ రిటైల్ కూరగాయలు, చేపలు, మాంసం, పూలు,ఇతర వస్తువుల విక్రయానికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్, సమీకృత మార్కెట్లను ఏర్పాటు చేయాలని తలపెట్టారు. అయితే నల్లగొండ పట్టణంలో నిర్మించిన సమీకృత మార్కెట్ లక్ష్యం నీరుగారి పోయింది. వ్యాపారులను ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేసి వారికి అనేక సౌకర్యాలు కల్పించాల్సిన ఉన్నా మూడేళ్లయినా ఇప్పటికీ అతీగతి లేని పరిస్థితి నెలకొంది.

నాన్‌వెజ్ మార్కెట్ తొలగింపు

సమీకృత మార్కెట్ ఎదురుగానే రామకోటి స్తూప దేవాలయం ఉంది. ఈ మార్కెట్‌లోని నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. దేవాలయం ఎదురుగా మాంసం విక్రయాలు జరపాలని నిర్ణయించడంపై విమర్శలకు దారితీసింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానికులు, భక్తుల విజ్ఞప్తి మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీకృత మార్కెట్ నుంచి నాన్‌వెజ్ మార్కెట్ తొలగించడమే కాకుండా ప్రకాశంబజార్‌లోని వస్త్రలత బజార్‌లో మాంసం విక్రయాల కోసం మార్కెట్‌లో ప్రత్యేకంగా ప్రారంభించారు.

దీంతో ఆ వివాదం సద్దుమణిగింది. ఇక చేపల విక్రయాలు కూడా దేవరకొండ రోడ్డు, పానగల్, ప్రకాశంబజార్‌లో చేస్తున్నారు. సమీకృత మార్కెట్‌లో నాన్‌వెజ్ మార్కెట్ స్థానంలోనే పూల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని తలపెట్టారు. అయినా ఇప్పటి వరకు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూల దుకాణాలను ఏర్పాటు చేయడానికి ప్రారంభం చేయాల్సి ఉన్నా ఆ వైపుగా అడుగులు వేయడం లేదు. సమీకృత మార్కెట్ ప్రారంభం కాకపోవడంతో చిరు వ్యాపారులు సరైన చోటు లేక రోడ్లపైనే విక్రయాలు చేపడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తయితే వ్యాపారులకు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం

సమీకృత మార్కెట్ ప్రారంభోత్సవంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. మార్కెట్‌లో కొన్ని నిర్మాణాలను మార్పులు,చేర్పులు చేసి వీలైతే వచ్చే నెలలో ప్రారంభించే అవకాశాలు ఉంటాయి. ప్రజలకు అందుబాటులోకి సమీకృత మార్కెట్‌ను తీసురురావాడానికి చర్యలు చేపడుతాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్, నల్లగొండ

మళ్లీ మార్పులు చేర్పులు తప్పవు

నాన్‌వెజ్ మార్కెట్‌కు అనుగుణంగా ఒక షెడ్ మొత్తం నిర్మాణాలు చేపట్టారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ మార్కెట్‌లో మార్పులు చేర్పులు చేయాలని అధికారులు నిర్ణయించారు. నాన్‌వెజ్ మార్కెట్ కోసం ఎత్తయిన దిమ్మెలు ఉండే విధంగా బండలతో నిర్మించారు. నీటి సౌకర్యాల కోసం పైపులైన్లు ఏర్పాటు చేశారు. నాన్‌వెజ్ మార్కెట్‌ను తొలగించినందున ఆ మార్కెట్‌లో పూల మార్కెట్ ఏర్పాటు చేస్తే దానికి అనుగుణంగా మళ్లీ నిర్మాణాలు చేయాల్సి ఉంది. దీనికోసం గతంలో కేటాయించిన నిధులు ఉన్నాయా? ఖర్చు అయ్యాయా? లేదంటే కొత్తగా మళ్లీ నిధులు మంజూరు చేయాలా అనే సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం అధికారులు సమీకృత మార్కెట్‌లో మార్పులు చేర్పులు చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో రైతు బజారులు కూడా సరిగ్గా లేకపోవడం ఉన్న బీట్ మార్కెట్‌లోని రైతుబజారులో అధిక శాతం వ్యాపారులే ఉంటున్నారు. కానీ అందులో విక్రయాలు జరగడం లేదు. వెంటనే సమీకృత మార్కెట్‌ను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

'పామాయిల్'కు ప్రాధాన్యమివ్వండి

● మీ వద్దకు వచ్చే పంట కొనుగోలు.. 3 రోజుల్లో చెల్లింపులు

● మంత్రులు తుమ్మల, ఉత్తమ్, పొన్నం



పేట జిల్లా కోదాడ మండలంలో సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేయాలి

మట్టిమనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు

మిర్యాలగూడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ మరణానంతరం అవయవదానం శరీర అవయవాలను దానం చేసినవారి భౌతికదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని మట్టిమనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు ప్రభుత్వాన్ని కోరారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురై అశోక్‌నగర్‌కు చేందిన ఆర్‌వీ.ప్రసాద్ మరణించడంతో కుటుంబ సభ్యులు ఆయన భౌతికకాయాన్ని విద్యార్థుల అధ్యయనం కోసం నల్లగొండ వైద్యకళాశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ జీవికైనా పుట్టడం, మరణించడం ఒక్కటేనని, జీవనం మాత్రం భిన్నమని అన్నారు. అనేక అనేక ఆచారాలు, సాంప్రదాయలాలు పాటించే సమాజంలో వాటిని కాదని సమాజం కోసం దేహాన్ని వైద్యవిద్యార్థుల కోసం ఇవ్వడమనేది గొప్ప మానవీయమైన విలువ అన్నారు. మిర్యాలగూడలో గతంలో మా నవహక్కుల నేత సుబ్బారావు భార్య సత్యవతి, కుమారుడు శరత్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాసరెడ్డి, రవీందర్‌రెడ్డి కుమారుడు అచ్యుత్, మల్లు స్వరాజ్యం, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి తండ్రి లింగారెడ్డి, చవ్వా రాంరెడ్డి ఇలా ఎందరో తమ శరీరాలను, అవయవాలను, కళ్లను దానం చేశారని అన్నారు.

వారి పరోపకార గుణానికి ప్రజలు, ప్రభుత్వం తగు రీతిలో స్పందించి వారి స్ఫూర్తిని మరికొందరికి అందించేందుకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని అన్నారు. మరణ శరీరాన్ని ఇచ్చిన పేద కుటుంబానికి ప్రభుత్వం పథకమేదైనా వర్తించేలా చూడాలని అన్నారు. ఆయన వెంట ప్రసాద్ భార్య లక్ష్మి, కుమార్తెలు సత్య, రమ్య, జడ్పీ మాజీ చైర్మన్ సీడీ.రవికుమార్, తలకోల శ్రీధర్‌రెడ్డి, బాలకృష్ణ, చెన్నూరు రంగారావు, ఇమ్రాన్ ఉన్నారు.

శ్రీమహాలక్ష్మిగా ఎల్లమ్మ తల్లి

కనగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద ఉన్న శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు శుక్రవారం శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారిని పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించారు. శ్రీలక్ష్మీ సహస్రనామాలతో విశేషంగా కుంకుమ పూజలు జరింపించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. చీర సారె ఒడిబియ్యం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



మిర్యాలగూడ

నాగార్జునసాగర్-దేవరకొండ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రోగులకు మెరుగైన వైద్య సేవలు

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి



దేవరకొండ డివిజన్ పరిధిలోని ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని దేవరకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తెలిపారు. 24 గంటల ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఆయన ఆంధ్ర జ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలు పేర్కొన్నారు.

(దేవరకొండ-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: దేవరకొండ డివిజన్‌లో ఎన్ని దవాఖానాలు ఉన్నాయి?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: దేవరకొండ డివిజన్‌లో 11 పీహెచ్‌సీలు, 64 పల్లె , రెండు బస్తీ దవాఖానాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: 24 గంటల ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదన్న ఫిర్యాదులమాటేమిటి?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: దేవరకొండ డివిజన్ పరిధిలో చందంపేట, చింతపల్లి, పీఏపల్లి, డిండి మండలాల్లో 24 గంటల ఆసుపత్రి నడుస్తుంది. రాత్రివేళలో సైతం వైద్యులు హెడ్‌నర్సులు అందుబాటులో ఉంటున్నారు.

ఆంధ్రజ్యోతి: పీహెచ్‌సీలో రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయా?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: పీహెచ్‌సీల్లో రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోనే ఉన్నాయి. డెంగ్యూ, మలేరియా వంటి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కొత్తగా పీహెచ్‌సీలు మంజూరయ్యాయా?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: కొత్తగా నేరేడుగొమ్ము, కంబాలపల్లి, దేవరకొండలో నాలుగు సబ్‌సెంటర్లకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలో మంజూరుకానున్నాయి.

ఆంధ్రజ్యోతి: సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: ప్రస్తుతం జ్వరాలు, నొప్పులతో ఎక్కువ మంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. వారందరికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. పరిశుభ్రతతో గోరు వెచ్చటి నీరు తాగాలని తగు సూచనలు చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పిస్తున్నాం.

సమీకృత మార్కెట్ ఏర్పాటు ఎప్పటికో..?

» దేవరకొండలో రోడ్లపైనే కూరగాయలు, మాంసం విక్రయాలు



దేవరకొండలో రోడ్డు పక్కన కూరగాయలు విక్రయాలు (ఫైల్)

దేవరకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్, కూరగాయల (సమీకృత) మార్కెట్ లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో మార్కెట్ లేకపోవడంతో కూరగాయలు, మాంసం, చేపలు ప్రైవేట్ స్థలాలతో పాటు, ప్రధాన రహదారులపై కూరగాయల విక్రయాలు చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. 2018లో పాత కూరగాయల మార్కెట్‌లో రూ.1.80 కోట్లతో కూరగాయల మార్కెట్‌కు అప్పటి ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరై టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో టెండర్ రద్దు చేశారు. మంజూరైన నిధులను సైతం ఇతర పనులకు ఉపయోగించారు.కాగా 2022లో వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ మార్కెట్‌కు అప్పటి ప్రభుత్వం రూ.4.50 కోట్లు మం జూరు చేసింది. ఐదు ఎకరాల స్థలంలో వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్ మార్కెట్ నిర్మించాలని మున్సిపల్ అధికారులు టెండర్ ప్రక్రియను ప్రారంభించారు. సిల్వర్ జూబ్లీక్లబ్ స్థలంలో శంకుస్థాపన చేశారు. కానీ ఆ స్థలం కోర్టు పరిధిలో ఉండడంతో మార్కెట్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. 2023లో దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో మార్కెట్‌ను ఏర్పాటుకు అప్పటి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ కళాశాల ఆవరణంలో మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడంతో ఆ ఆలోచనను విరమించుకున్నారు. అధికారులు ప్రభుత్వ స్థలాలను మార్కెట్ కోసం పరిశీలించడానికే పరిమితమయ్యారు. కానీ కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ప్రస్తుతం కూరగాయలు, పండ్లు, పూలు, మటన్, చికెన్ వివిధ రకాల దుకాణాలు వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి విక్రయి స్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

దేవరకొండ, చం దంపేట, నేరేడుగొమ్ము, ఇతర మండలాల నుంచి రైతులు తాము పండించిన కూరగాయలను దేవరకొండకు తెచ్చి హోల్ సేల్‌గా వ్యాపారులకు విక్రయిస్తున్నారు. రైతుబజార్, కూరగాయల మార్కెట్ లేక పోవడంతో మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన రేటుకే కూరగాయలు విక్రయించాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. మేకల మాంసం సైతం రహదారుల వెంట కోసి మాంసాన్ని విక్రయి స్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యాపారులు అనా రోగ్యంతో ఉన్న మేకలను సైతం విక్రయిస్తున్నప్పటికి అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్ మార్కెట్ ఏర్పాటయితే అన్ని రకాల కూరగాయలు ఒకే చోట దొరుకుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆరేళ్లుగా శంకుస్థాపనకే పరిమితం

దేవరకొండలో కూరగాయల మార్కెట్‌తో పాటు సమీకృత మార్కెట్ నిర్మాణాలు ఆరేళ్లుగా స్థల పరిశీలనలు, శంకుస్థాపనలకే పరిమితం అయ్యాయి. పాత కూరగాయల మార్కెట్‌లో ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికి అక్కడ కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయడంలో అధికారులు సుముఖత చూపడంలేదని పట్టణ ప్రజలు ఆరోపి'స్తు న్నారు. రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని ప్రజలు తెలుపుతున్నారు. సమీకృత మార్కెట్‌కు స్థలం కేటాయించి మళ్లీ టెండర్లు పిలిచి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పాత బజార్‌లో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి



దేవరకొండ పట్టణంలోని గాంధీబజార్ పాత మార్కెట్ ప్రభుత్వ స్థలంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికి మార్కెట్ ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా శంకుస్థాపనలు చేసి వదిలేస్తున్నారు.

\- వస్కుల సుధాకర్, దేవరకొండ

ఉన్నత అధికారులకు నివేదికలు పంపించాం

దేవరకొండలో వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్ మార్కెట్ స్థలం కోసం ప్రభుత్వానికి నివేదికలు పం పించాం. గత ప్రభుత్వ హయాం లో మార్కెట్‌కు నిధు లు మంజూరు చేసినప్పటికి ఇతర పనులకు మళ్లించారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు మార్కెట్ ఏర్పాటు చేస్తాం.

\- దేవరకొండ మున్సిపల్ ఏఈ రాజు

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా హరికృష్ణ



దేవరకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా కిన్నెర హరికృష్ణ రెండోసారి ఎన్నికయ్యారు. హరికృష్ణ గతంలో ఎన్ఎస్‌యూఐ దేవరకొండ మండలాధ్యక్షుడిగా పనిచేశారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా 2020లో మొదటిసారి ఎన్నిక య్యారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే బాలునాయక్‌కు హరికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

లీగల్‌సెల్ జాయింట్ కన్వీనర్‌గా రాజశేఖర్

దేవరకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలం పద్మట్‌పల్లి గ్రామానికి చెందిన న్యాయవాది కొమ్ము రాజశేఖర్‌ను టీ. పీసీసీ లీగల్ హ్యూమన్‌రైట్స్ అండ్ ఆర్‌టీఐ డిపార్ట్‌మెంట్ విభాగానికి రాష్ట్రజాయింట్ కన్వీనర్‌గా నియమిస్తూ టీ.పీసీసీ లీగల్‌సెల్ పొన్నం అశోక్‌గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవరకొండలో రాజశేఖర్ ను ఎమ్మెల్యే బాలునాయక్ శాలువాతో సన్మానించి అభిన ందించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నెమికంటి గౌరి శంకర్, ముస్తాక్ అహ్మద్, సురేష్, రామ స్వామి పాల్గొన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పొన్నం అశోక్‌గౌడ్‌కు, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీకి కుర్చీల బహూకరణ



కుర్చీలు బహూకరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

దేవరకొండ, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): దేవరకొండ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌కు 30 కుర్చీలు, పలకలు బహూకరించినట్లు క్లబ్ అధ్యక్షుడు వస్కుల కృష్ణయ్య, శిరందాసు కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధానకార్యదర్శి సముద్రాల ప్రభాకర్, గాజుల రాజేష్, ఎల్‌ఐసీ బీఎం రాముచౌహాన్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం కృషి



మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థిక బలోపే తానికి కాం గ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సావాల్లో భాగంగా స్థానిక లక్ష్మీనర్సింహాగార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లవినియోగదారులకు ఉచిత విద్యుత్ అమలు చేశామని గ్యాస్ సిలిండర్‌కు రూ. 500 సబ్సిడీ, రైతులకు క్వింటా ధాన్యానికి 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని సుమారు 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఒక వైపు వడ్డీలు కడుతూ మరోవైపు అభివృద్ధి సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి జానారెడ్డి స్ఫూర్తితో తన సొంత నిధులు రూ.1.25 కోటితో బ్రిడ్జి , దుప్పట్లు, ట్రై సైకిళ్లు, డెస్క్ బెంచీలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ముకుందాపురం నుంచి అల్వాల అడ్డ రోడ్డు వరకు రోడ్డును పొడిగించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 4,272 సంఘాలకు రూ.191 కోట్లు అందించినట్లు చెప్పారు. వడ్డీ లేని రుణాలను పాడిపరిశ్రమ ద్వారా 55 మందికి గేదెలను అందించామని, స్త్రీ నిధి కింద రూ. 16.4 కోట్లు అందించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అంకతిసత్యం, తహసీల్దార్ రఘు, పీసీసీ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, యడవల్లి నరేందర్‌రెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, ఆంగోతు భగవాన్‌నాయక్, కలసాని చంద్రశేఖర్, చింతల చంద్రా రెడ్డి, రాజాప్రసాద్, గౌని రాజా రమేష్ యాదవ్, పిల్లి ఆంజనేయులు, మల్‌రెడ్డి భాను, ఏపీఎం కళావతి, నకిరేకంటి సైదులు పాల్గొన్నారు.

'వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

దేవరకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేసినవారిలో ఇరుగ దిండ్ల కృష్ణ, గండి కోట వెంకటయ్య, ఇరగదిండ్ల రాములు, శ్రీశైలం, నర్సింహ, రాములు భాస్కర్ ఉన్నారు.

'బీసీల రిజర్వేషన్లు పెంచాలి'

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతుల కమిషన్ కార్యదర్శి నీరజకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీలకు అట్రాసిటీ చట్టం రూపొందించాలన్నారు కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, బంటు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నరసింహ పాల్గొన్నారు.

అన్నివర్గాలను అక్కున చేర్చుకుంటున్న కేంద్రం

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని అన్ని వర్గాలను అక్కున చేర్చుకుంటుందని బీజేపీ ఇండస్ట్రియల్ సెల్ జిల్లా కన్వీనర్ తల్లం అశోక్ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచడం హర్షనీయమన్నారు. రైళ్ల లో సాధారణ బోగీలు రెండే ఉండటంతో పేద, మధ్య తరగతి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బోగీలను పెంచడం గొప్ప విషయమన్నారు.

గిరిజన ఉపాధ్యాయుల సంఘం కార్యవర్గం ఎన్నిక

వేములపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గాన్ని గౌరవ అధ్యక్షుడు భూక్య లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్ర వారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా డి.శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శిగా డి.హేమానాయక్, కోశాధికారిగా డి.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ర కృష్ణకాంత్‌నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బానావత్ సైదులునాయక్, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆందోళన చెందొద్దు



దేవరకొండ మోడల్‌స్కూల్‌లో భోజనం చేస్తున్న అధికారులు

దేవరకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జ్వరం కారణంగానే ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, మిగిలిన విద్యార్థులు ఆందోళన చెందవద్దని, తహ సీల్దార్ సంతోష్ కిరణ్ సూచించారు. దేవరకొండ పట్టణ శివారులోని పెంచికల్‌పహడ్ మోడల్‌స్కూల్‌ను సీఐ నర్సింహులు, ఎంఈవో మాతృనాయక్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో రమణ, టి.బుచ్చిరెడ్డి, ఎస్ఆర్. కనకచారి, విజేంద ర్‌రెడ్డి, జంగయ్య, హుస్సేన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

డిండి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పోషక విలువలు ఉన్న నాణ్యమైన భోజనం అందించాలని ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ శైలిమ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పరిశుభ్రతను పాటించి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలని సూచించారు. ఆమె వెంట హెల్త్ అసిస్టెంట్ ప్రదీప్, ఏఎన్ఎం రుక్సాన, ప్రిన్సిపల్ శిరీష ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



దామరచర్ల దీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

దామరచర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమకు సమాన పనికి తగ్గ వేతనం చెల్లించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం మండలకేంద్రంలో రిలే దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షంలో ఉన్న రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటి వరకు తమకు కనీస వేతనం చట్టం అమలు చేయలేదన్నారు. ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు.

● మిర్యాలగూడ టౌన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎంఈవో బాలుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు మహేశ్వరపు కిరణ్‌కుమార్, ఉమాశంకర్, నిరంజన్, హారిక, నాగేందర్, మనోహర్, వంశీకృష్ణ, రేణుక ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేసి మాట్లాడుతున్న గ్రామస్థులు

వేములపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావువారిగూడెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ స్కూళ్లకు సంబంధించిన ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు శుక్రవారం ఆక్రమణకు గురైన భూమి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గ్రామానికి చెందిన దాత ఒకరు ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు భూమిని ఇవ్వగా పక్కనే ఉన్న రైతు ఆ స్థలాన్ని ఆక్రమించడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడు తున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, పాఠశాలకు దారి లేక చిన్నారులు, బాలింతలు ట్రాన్స్‌పార్మర్ వెంట ప్రమాదక రంగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకో కపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు నారాయణ, రవీందర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సోమిరెడ్డి, కవిత, ఆశమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై సీపీఐ పోరాటం

డిండి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పోరాడిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ ఖానాపూర్ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వాలను ఎండగట్టి హక్కులను సాధించుకున్న ఘనత కమ్యూనిస్టు పార్టీదని తెలిపారు. ఈనెల 26న సీపీఐ వంద వసంతాలు పూర్తయిన సందర్భంగా గ్రామ, గ్రామానా పార్టీ పతకాలను ఎగురవేయా లని ఆయన సూచిం చారు. ఈనెల 30 నల్లగొండలో జరిగే భారీ బహి రంగ సభకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం



వేములపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శెట్టిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థి భార్గవికి గ్రామానికి చెందిన ముత్తినేని సుగుణ రాములు తన కుటుంబ పేరుమీద రూ.5వేల నగదు ప్రోత్సాహకం శుక్రవారం అందజేశారు కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్,ప్రధానోపా ధ్యాయు డు సత్యనారాయణ, ముత్తినేని సుగుణ, డాక్టర్ భవాని, డాక్టర్ శంకర్‌రావు, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలగిరికి చెందిన సిగపట్ల వెంకటమ్మ పేదరికంతో ఇబ్బందులు పడుతోంది. దీంతో మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు పగడాల సైదులు యాదవ్ శుక్రవారం ఆమెకు రూ.10 వేలు అందజేశారు.

అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దాం: ఎమ్మెల్యేలు



మిర్యాలగూడ : అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్



చింతపల్లి :అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

మిర్యాలగూడ, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాధించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సాగర్‌రోడ్డులో అంబేడ్కర్ విగ్రహానికి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిత్రపటానికి డీసీసీ శంకర్‌నాయక్ తో కలిసి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. అలాగే పలు సంఘాల నాయ కత్వంలో వర్ధంతిని వేర్వేరుగా నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, స్కైలాబ్ నాయక్, పొదిల శ్రీనివాస్, బెజ్జం సాయి, తలకొప్పుల సైదులు, ఉబ్బపెల్లి కాశయ్య, చిన్న పంగు శ్రవణ్ పాల్గొన్నారు.

● చింతపల్లి : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పూల మాల వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబే ద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ క యార్డు చైర్మన్ దొంతం అలివేలు, సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, ముచ్చర్ల యాదగిరి, కొండల్ పాల్గొన్నారు.

● చందంపేట : మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు కొండ్రపల్లి నగేష్ మాట్లాడుతూ అంబే ద్కర్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. అంతకు ముందు అంబే ద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాతంగి హరికృష్ణ, జబ్బు శ్రీశైలం పాల్గొన్నారు.

● దేవరకొండ :దేవరకొండ బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహా నికి ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య, రాజరావు, దళితసంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులడు పల్లా నర్సింహరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకూరి నర్సింహ, సురేష్, గుండాల అంజయ్య యాదవ్, సీపీఎం జిల్లా సహాయకార్యదర్శి నల్ల వెంకటయ్య వేర్వేరుగా అంబేడ్కర్ విగ్రహాలకు పూల మా ల వేసి నివాళులు అర్పించారు.

● పెద్దవూర : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఆడెపు నాగార్జున, నాయకులు పులిమాల కృష్ణారావు, పవన్, ముత్యాలు పాల్గొన్నారు.

● డిండి : మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాం గ్రెస్ నాయ కులు బాదమోని శ్రీనివాస్‌గౌడ్ తండు చంద్రయ్య, ఎం.ఎ.కలీం త పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్): మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు లక్కమల్ల మధుబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జంగాల లక్ష్మమ్మ, రువ్వ వెంకన్న, జంగాల నాగార్జున, జంగాల వెంకట్రాములు, రువ్వ అనంతరాములు పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ : హిల్‌కాలనీలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ అవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజా, కిశోర్ పాల్గొన్నారు.

● హాలియా : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా చైర్మన్ లకుమాల మధుబాబు రువ్వ వెంకటేశ్వర్లు, జంగాల వెంకటరాములు, రువ్వ అనంతరాములు, మాకమళ్ల జంగయ్య, గండమళ్ల జానయ్య, జంగాల భిక్షం, లకుమాల లింగయ్య పాల్గొన్నారు. అలాగే మాగిగ రిజర్వేషన్ సమితి, మాదిగ ఉద్యోగల సమాఖ్య, మాదిగ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు మందా సైదులురావు, గౌతమ్ విశ్రాంత ఏఎస్ఐ యడవల్లి సోమశేఖర్, రమావత్ సర్దార్ నాయక్, యడవల్లి రమేష్, మందా లక్ష్మి పాల్గొన్నారు.

● అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో హాలియా మునిసిపాలిటీ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి అనుముల మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, కౌన్సిలర్లు పిల్లి ఆంజనేయులు, తక్కెళ్లపల్లి సైదులు, ప్రసాద్‌నాయక్, మజహర్ మొయినుద్దీన్, పాండునాయక్, నెర్మటి వెంకట్‌రెడ్డి, పాంపాటి శ్రీనివాస్, గడ్డం రమణయ్య, నకిరేకంటి సైదులు, నామని సుధాకర్, నర్సింహా, కుమార్ పాల్గొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

గుర్రంపోడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దైవచింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని కట్టవారిగూడెం గ్రామంలో నిర్వహించిన హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహాపడిపూజలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పరిసర ప్రాంతాల నుంచి అయ్యప్ప, హనుమా న్, శివస్వాములు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు పోలె రామచంద్రం, పాల్గొన్నారు.

●చందంపేట :మండల కేంద్రంలో జరిగిన హనుమాన్ మూడో పడిపూజలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఈశ్వర్ జీ, జబ్బు శ్రీశైలం, జబ్బు తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ

దేవరకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవరకొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ ప్రారంభించారు. అలాగే తెలంగాణ సాంస్కృతిక సారధి నల్లగొండ జిల్లా కళాబృందం కళాకారులు ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. విజయోత్సవ ర్యాలీలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, కళాకారులు, అధికారులు పాల్గొన్నారు.